## అధ్యాయము 9

# నూతన లోకము కొరకు దేవుని ఆజ్ఞలు మరియు నిబంధన

ఓడను విడచిన తరువాత, నోవహు రెండవ ఆదాముగా పంపబడెను. లోకము పాపము ద్వారా చెడిపోయి నాశనము చేయబడెను, అయితే నోవహు కుటుంబం మాత్రం దేవుని స్వరూపమును కలిగియుండెను. ఓడలో భద్రపరచబడిన నోవహు మరియు ఇతరుల ద్వారా దేవుడు సమస్త జీవులకు ఒక నూతన ఆరంభమును స్థాపించుచున్నాడు.

### నూతన లోకమునకు దేవుని ఏర్పాటులు (9:1–7)

**[1]మరియు దేవుడు నోవహును అతని కుమారులను ఆశీర్వదించి–మీరు ఫలించి అభివృద్ధి పొంది భూమిని నింపుడి. [2]మీ భయమును మీ బెదురును అడవి జంతువులన్నిటికిని ఆకాశపక్షులన్నిటికిని నేలమీద ప్రాకు ప్రతి పురుగుకును సముద్రపు చేపలన్నిటికిని కలుగును; అవి మీ చేతి కప్పగింపబడి యున్నవి. [3]ప్రాణముగల సమస్త చరములు మీకు ఆహారమగును; పచ్చని కూర మొక్కలనిచ్చినట్లు వాటిని మీకిచ్చియున్నాను. [4]అయినను మాంసమును దాని రక్తముతో మీరు తినకూడదు; రక్తమే దాని ప్రాణము. [5]మరియు మీకు ప్రాణమైన మీ రక్తమును గూర్చి విచారణ చేయుదును; ప్రతినరుని ప్రాణమును గూర్చి వాని సహోదరుని విచారణ చేయుదును. [6]నరుని రక్తమును చిందించు వాని రక్తము నరునివలననే చిందింపబడును; ఏలయనగా దేవుడు తన స్వరూపమందు నరుని చేసెను. [7]మీరు ఫలించి అభివృద్ధి నొందుడి; మీరు భూమిమీద సమృద్ధిగా సంతానము కని విస్తరించుడని వారితో చెప్పెను.**

**వచనం 1.** 1:28లోని మొదటి ఆశీర్వాదమును పునరావృత్తం చేయుట ద్వారా దేవుడు **నోవహు మరియు అతని కుమారులపై** ఆశీర్వాదమును మాటల్లో చెప్పెను. ఇక్కడ ఉన్న ఆజ్ఞ క్లుప్తీకరించబడినప్పటికీ, పదాలు మాత్రం మాటకు మాటగా

ఉన్నాయి: **మీరు ఫలించి అభివృద్ధి పొంది భూమిని నింపుడి** (8:17 చూడండి). ఇటువంటి ఆశీర్వాదమే ఈ భాగం యొక్క చివరిలో ఇవ్వబడెను, అయితే అది విస్తరించిన మాటలలో కనిపిస్తుంది (9:7). ఫలించవలసిన మొదటి బాధ్యత మాత్రం కొనసాగింది; లోకమును మరొక మారు నింపవలసియుండెను.

**వచనాలు 2, 3**. జంతు రాజ్యముపై మానవుని అధికారమును గూర్చి మరలా చెప్పిన తరువాత, దేవుడు జంతువులను చంపుట మరియు భుజించుటను గూర్చి కొన్ని హెచ్చరికలు ఇచ్చెను. మానవుడు ఖచ్చితముగా శాకాహారిగా ఉన్నాడా, లేక జలప్రళయానికి ముందు చంపబడిన లేక దేవునికి బలిగా అర్పించబడిన జంతువుల మాంసమును తినేవాడా? దీనికి జవాబును నిర్ధారించి చెప్పుట కష్టం (1:29, 30పై వ్యాఖ్యలను చూడండి). జలప్రళయమునకు ముందు కడపటి విషయం నిస్సందేహంగా జరిగియుండవచ్చు గాని (1:29), ఏదెను తోటలో వారికి ఆయన **ప్రతి పచ్చని చెట్టును** ఆహారముగా ఇచ్చినట్లు, **ప్రాణముగల సమస్త చరములను** దేవుడు మానవులకు ఆహారముగా ఇచ్చుట ఇదే మొదటి సారి.

ప్రతి జంతువులోను, భూమి మీద ప్రాకు ప్రతి దానిలోను, మరియు సముద్రములోని చేపలన్నిటిలోను ఆహారము కొరకు **కొన్ని చంపుటకు** మానవులకు అధికారము ఇవ్వబడగా **జంతు రాజ్యములో ఒక ముఖ్యమైన మార్పు చోటుచేసుకొనెను**. ఆరంభము నుండి మానవునికి భూమి మీద ఉన్న క్రింది స్థాయి జీవులపై అధికారం ఉన్నప్పటికీ (1:26–28), ఈ వాక్యభాగము దాని కంటె ఒక బలమైన విషయమును సూచిస్తుంది. ఈ సమయం మొదలుకొని, క్రింది స్థాయి జీవులు మానవుల సమక్షంలో జాగ్రత్తగా ఉండుట మాత్రమే గాక, మానవులంటే భయమును బెదురును కలిగియుంటాయి. ఈ నూతన అనుబంధము ఆదాము జంతువులతో తోటలో కలిగియున్న అనుబంధము కంటె (2:19, 20) మరియు ఓడలో నోవహుతో కలిగియున్న అనుబంధము కంటె (7:8, 9) వేరైనదిగా అనిపిస్తుంది.

జలప్రళయం తరువాత దేవుడు "ప్రాణముగల సమస్త చరములను" అక్షరార్థంగా మానవులకు ఆహారంగా ఇచ్చెనా లేదా అనేది ఈ వాక్యభాగములో ఎదురయ్యే మరొక కలవరపరచు విషయం. కేవలం పవిత్రమైన జంతువులు, పక్షులు, చేపలు, మరియు పురుగులు మాత్రమే గాక, తరువాత మోషే ధర్మశాస్త్రములో "అపవిత్రమని" (లేవీ. 11:1–47) ఎంచబడిన వాటిని కూడ తినుటకు ఈ ప్రజలకు దేవుడు అనుమతి ఇచ్చెనా? ఈ చరిత్రలోని ఆరంభంలో అపవిత్రమైన జంతువులు మరియు పవిత్రమైన జంతువుల మధ్య భేదము చూపబడెను కాబట్టి (7:2, 8; 8:20), అట్టి భేదము ఇక్కడ కూడ మనం ఊహించవచ్చు. ఏదిఏమైనా, మానవులు పవిత్రమైన ప్రాణులను మాత్రమే తినాలని మరియు అపవిత్రమైనవి తినకూడదని దేవుడు కోరినయెడల, "ప్రాణముగల సమస్త చరములను" ఆయన మానవుల యొక్క సామాన్య

ఆహారములో జోడించుట ఆశ్చర్యమును కలిగిస్తుంది.

ఇటువంటి వాదనలో నిలకడగా ఉండాలంటే, క్రొత్త నిబంధనలోని పవిత్రమైన మరియు అపవిత్రమైన ఆహారములను గూర్చి చేసిన వ్యాఖ్యలను ఇలాగే భావించాలి. "భోజనపదార్థము లన్నిటిని పవిత్రములు" అని యేసు మాటలను మార్కు వ్రాసినప్పటికి (మార్కు 7:19), "దేవుడు సృజించిన ప్రతి వస్తువును మంచిది, కృతజ్ఞతాస్తుతులు చెల్లించి పుచ్చుకొనినయెడల ఏదియు నిషేధింపతగినది కాదు" అని పౌలు అన్నప్పటికి (1 తిమోతి 4:4), పవిత్రమైన మరియు అపవిత్రమైన ఆహారములకు మధ్యగల వ్యత్యాసం నేడు కూడా వర్తిస్తుంది అని మనం చెప్పగలమా? ఖచ్చితంగా కాదు, అలాగే జలప్రళయము తరువాత ఆహారమును గూర్చి దేవుడు పరిమితిని తొలగించడాని కూడా చెప్పడం సరియైన పని కాదు. ధర్మశాస్త్రమునకు మునుపు, పవిత్రమైన మరియు అపవిత్రమైన ఆహారములను గురించి విధించబడిన ఆంక్షలన్నీ భోజన విషయములో కాక బలులనర్పించు విషయంలోనే వర్తించినట్లుగా ఉన్నాయి.

**వచనం 4.** దేవుడు మానవాళికి మాంసమును దాని **రక్తముతో మీరు తినకూడదు, రక్తమే దాని ప్రాణము** అని చెప్పడం పరిశుద్ధ గ్రంథంలో ఇది మొదటి సారి. రక్తమును తినుటను గురించి తరువాత ఇశ్రాయేలీయులకు స్పష్టమైన ఆజ్ఞలు చాలా ఇవ్వబడ్డాయి (లేవీ. 3:17; 7:26, 27; 17:10–14; ద్వితీ. 12:15, 16, 20–24), మరియు అపొస్తలుల కార్యములు 15:29లో అన్యజనులలో నుండి వచ్చిన క్రైస్తవులకు కూడా ఇదే హెచ్చరిక ఇవ్వబడింది. దేవుడు మాత్రమే ప్రాణమును ఇవ్వగలవాడు గనుక, జలప్రళయము తరువాత మిగిలిన ప్రజలు ప్రతి జీవిలో దేవుడు ఉంచిన జీవపు శక్తిని గౌరవించవలసిన వారిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో, రక్తము ప్రాణముతో సమానముగా ఎంచబడింది; ఈ కారణము చేతనే, దానిని తినుటగాని త్రాగుటగాని నిషేధించబడినది.

ప్రాచీన పశ్చిమ ఆసియా అంతటిలో ఇటువంటి నిషేధము ఎక్కడా కనిపించదు. ధర్మశాస్త్రము ఒక పురాతన అన్యమత నిషిద్ధములనుండి వచ్చినది కాదని, అది ఒక దైవిక ఆజ్ఞ అని దాని విశిష్టత సూచిస్తుంది.[1] ఈ ఆజ్ఞ ఇశ్రాయేలీయులవలె ఎన్నుకొనబడిన ప్రజలకు వర్తించింది మాత్రమే కాదు; అది ప్రజలందరికి వర్తిస్తుంది, ఎందుకంటే అందరు కూడా నోవహు సంతానమే. ప్రాచీన కాలములోని కొందరు అన్యమతస్తుల వలె మానవులు రక్తపుదాహము కలవారిగా కాకూడదని దేవుడు ఆశించాడు.[2] రక్తమును తినుట లేదా త్రాగుట అంటే సమస్త జీవులకు జీవాన్ని ఇచ్చిన దేవుని అగౌరవపరచినట్లు. జంతువులను ఆహారముగా భుజించుటకు మానవులకు దైవిక అనుమతి ఇవ్వబడినప్పటికి, ఈ జీవుల బాగోగులు చూడబడాలి కాని విలాసాలకు దుర్వినియోగపరచబడకూడదు. జంతు ప్రపంచంపై మానవుడు ఆధిపత్యం కలిగి ఉండాలని దేవుడు ఉద్దేశించాడు (కీర్తనలు 8:3–8), కాని దేవుని సృష్టిపై ఒక నమ్మకమైన కార్యనిర్వాహకునిగా

అతడు వాటిని పరిపాలించాలి. దేవుడు ఒక్కడికే సార్వభౌమత్వము కలదు.

**వచనం 5**. తరువాత వాక్యము మానవుని జీవితపు విలువను గూర్చిన మరియొక దైవిక నిర్దేశంతో మొదలౌతుంది: దేవుడు, **మరియు మీకు ప్రాణమైన మీ రక్తమును గూర్చి విచారణ చేయుదును; దానిగూర్చి ప్రతి జంతువును నరులను విచారణ చేయుదును; ప్రతి నరుని ప్రాణమును గూర్చి వాని సహోదరుని విచారణ చేయుదును** అని అన్నాడు. జంతువులు నైతిక జీవులు కాకున్నను, "మానవుడు" మరియు "మృగముల"పై సమానంగా దేవుడు మరణ దండనను విధిస్తాడు అనే విషయం కొంచెం ఆశ్చర్యం కలిగించవచ్చు. అయినను, జలప్రళయము ముందటి భూమి మిక్కిలి చెడుతనము (6:11)తో నిండియున్నందున, అందులో విచక్షణలేని నరహంతకులు కూడా ఉన్నారు, దేవుడు అటువంటి ప్రవర్తనను సహించడనే విషయం నోవహు మరియు అతని సంతానమునకు గుర్తుండిపోయేలా చెప్పాలనుకున్నాడు. మానవుని జీవితము ఎంత పవిత్రమైనదంటే అది మానవుడు మరియు జంతువుల నుండి కూడా లెక్క కోరుతుంది.

లేఖనభాగం మూడు సార్లు "విచారణ చేయుదును" అని చెబుతుంది మరియు దేవుడు ఇక్కడ ప్రథమా విభక్తి సర్వనామములో కర్తయై ఉన్నాడు. వీటిలో మొదటి సారి దేవుడు, "మీకు ప్రాణమైన మీ రక్తమును విచారణ చేయుదును" అన్నాడు. దేవుడు "ప్రాణమునకు ప్రాణమును" "కోరుతాడు" (דָּרַשׁ, *darash*) అని ఈ మాటల అర్థం.[3] ఈ నియమము ప్రకారము, ఒక వ్యక్తిని చంపడం మానవుని తన పోలికలో చేసిన దేవునికే వ్యతిరేకంగా క్రియ జరిగించడమే (1:26, 27; 5:1, 2; 9:6).

బాధ్యత కలిగిన ప్రతినిధుల వలె మానవులు మరియు జంతువులు ఈ దైవికమైన ఆమోదం క్రింద ఉన్నారనే విషయం తరువాత వచ్చిన ధర్మశాస్త్రమందు పునరావృతం చేయబడింది. "చీల్చివేసే అలవాటు ఉన్న" ఒక ఎద్దును గూర్చిన ఉదాహరణను ధర్మశాస్త్రం ఇచ్చింది: అటువంటి ఎద్దు యొక్క యజమానుడు దాని స్వభావాన్ని ఎరిగి ఉన్నట్లయితే, ఆ జంతువును కట్టి ఉంచాలి. ఇలా చేయడంలో అతడు విఫలమై ఆ ఎద్దు ఒక వ్యక్తిని చంపినట్లయితే, అప్పుడు ఆ యజమానుడు మరియు ఎద్దు కూడా చంపబడాలి (నిర్గమ. 21:29).

ప్రతివాని సహోదరుడు అన్న పదాలకు అర్థం ఏంటి? ఇక్కడ భాష హేబెలును కయీను చంపిన మొట్టమొదటి నరహత్యను సూచిస్తుంది (4:8), అలానే మనమంతా మానవ కుటుంబంలో భాగమనే ఆలోచనను కూడా అది కలిగియుంది.[4] ఈ రెండవ విషయ సాధ్యాసాధ్యాలను గూర్చి మాట్లాడితే, "ప్రతివాని సహోదరుని" అనే మాటను కొన్ని అనువాదాలు (NIV, ESV) "తోటి మనిషి"గా పరిగణిస్తున్నాయి. "ఎవరైనా తోటి మానవుని చంపినట్లయితే వాడు చావాలి" అని NLT అనువాదం చెప్తుంది. వేరొక వివరణలో, "ప్రతివాని సహోదరుడు" అనేది ఒకరి సహోదరుని హత్యకు ప్రతీకారంగా హంతకుని హత్యచేసి రక్తమునకు పగ

తీర్చుకునే వాడు అని కూడా ఉంది (సంఖ్యా. 35:9–34; ద్వితీ. 19:1–13 చూడండి).

**వచనం 6**. నేరమునకు సరిపడు శిక్షవేయాలనే ఆలోచనను ఈ వచనం కొనసాగిస్తూ **నరుని రక్తమును చిందించు వాని రక్తము నరుని వలననే చిందింపబడును** అని కూడా చెప్తుంది. “రక్తమును చిదించుట” అనే మాట ఆదికాండము 37:22లో యోసేపును చంపవద్దని రూబేను తన సహోదరులను కోరుకున్న వాంఛిత హత్యను గూర్చి ప్రయోగించబడింది (1 రాజులు 2:31; యెహెజ్కేలు 22:4 చూడండి). బైబిల్లో నరహత్య ఎంతటి ఘోరమైనదిగా పరిగణించబడిందంటే, అట్టి నరహంతకుడు చంపబడాలని దైవిక ఆజ్ఞ ఇవ్వబడింది. ఈ వాక్యము కొన్ని ప్రశ్నలను తలెత్తిస్తుంది: హంతకుడు ఒక మానవునిచే చంపబడాలని ఉండగా, ఆ హంతకుని రక్తమును చిందించిన మానవుడు కూడా హంతకుడు కాడా? ఈ ప్రశ్నకు అభ్యంతరాలు ఎన్ని ఉన్నా, దీనికి “కాదు” అనేది సమాధానం. మరణశిక్ష చట్టాన్ని ఒకని అధీనంలోనికి తీసుకుని వ్యక్తిగతంగా పగ తీర్చుకోనంత వరకు అది హత్యకాదు.

హంతకునిపై ప్రతీకారం తీర్చుకోవడం అనేది వ్యక్తిగత విషయంగా ఉండుటకు ఉద్దేశించబడలేదు. కాని, దేవుడు దానిని సమాజము యొక్క బాధ్యతగా చేసాడు. మన పితరుల కాలములో ఇది ఎలా జరిగేదో మనకు తెలియపరచబడలేదు, కాని మోషే ధర్మశాస్త్రములో చట్టపరమైన విధులు ఎలా చేయబడ్డాయో మనకు తెలుసు. ప్రమాదవశాత్తు జరిగిన మరణమునకు “రక్తానికి ప్రతీకారం” తీర్చుకునే వారి నుండి భద్రతను (సమీప బంధువు) దేవుని ధర్మశాస్త్రం అందించింది. అట్టి నేరమును “ఆశ్రయ పురము”లోని పెద్దలు వినాలి; ఆ నిందితుడు నిజంగా కావాలని హత్యచేసాడని తేలితే, వాడు చంపబడాలి (నిర్గమ. 21:12–14; సంఖ్యా. 35:9–34; ద్వితీ. 19:1–13). క్రీస్తు నియమము ప్రకారం కూడా ఇదే నియమము వర్తిస్తుంది. పౌలు రోమీయులకు వ్రాసిన పత్రికలో పౌర ప్రభుత్వము మరణ దండన యొక్క ఖడ్గాన్ని “దుష్టత్వం జరిగించిన వారిపై” ఝుళిపించడానికి హక్కు ఉందని గుర్తించాడు (రోమా. 13:4). తన విషయంలో కూడా, “మరణమునకు అర్హునిగా” తాను నిరూపించబడితే తనపై మరణశిక్షను ప్రకటించుటకు కైసరుకున్న హక్కును పౌలు ప్రస్తావించాడు (అపొ. 25:11).

ఇక్కడ మరొక ప్రశ్న తలెత్తుతుంది: హంతకుడు చంపబడాలని దేవుడు ఎందుకు కోరతాడు? దీనికి క్లుప్త సమాధానంగా దేవుని సృష్టిలో భాగంగా మానవుని జీవితం వచ్చింది గనుక అది పవిత్రమైనది అని చెప్పవచ్చు. మానవుడు జ్ఞానమును యాదృచ్ఛికంగా సంపాదించుకోలేదు అను మాట సత్యమైనను, ఈ విషయంపై ఆలోచన అంత లోతుగా వెళ్ళదు. ఈ భూమిపై ఉన్న జీవులలోకెల్లా మానవుని జీవము నాణ్యతలో వ్యత్యాసమైనది గనుక నరహత్య చట్టవిరుద్ధం చేయబడింది. ఒక వ్యక్తి హంతకుడు అని నిరూపించబడినట్లయితే అట్టి

వ్యక్తి తన ప్రాణాన్ని పోగొట్టుకోవాలి ఎందుకంటే ఈ భూమిపైన జీవులలోకెల్లా మానవుడు మాత్రమే పవిత్రమైన దేవుని పోలికను కలిగియున్నాడు. మానవునిలో ప్రజలు **దేవుని పోలికను** ఎప్పుడు చూడలేరో, అప్పుడు **మానవులు** జంతువులవలె పరిగణించబడతారు, జీవితం విలువలేనిదిగా అవుతుంది. ఇట్టి భావన ప్రతివిధములైన అరాచకాలకు మరియు సామూహిక హత్యలకు దారితీస్తుంది, ఎందుకంటే మానవుని వ్యక్తిత్వాన్ని గౌరవించే ప్రతి ఆధారాన్ని లేదా తనకు ఆ గౌరవాన్ని ఇచ్చిన దేవుని గౌరవించే ప్రతి ఆధారాన్ని అది త్యజిస్తుంది.

ఇటువంటి అర్థంతో కూడా ఒక సంగ్దిగ్ధత వస్తుంది. ఒక ప్రక్క, సృష్టికర్త మరియు జీవమునిచ్చువాడు దేవుడే కనుక, ఆ జీవాన్ని తీసుకొనుటకు ఆయనకు మాత్రమే అధికారం ఉన్నదని అర్థమౌతుంది. మరొక ప్రక్క, నరహంతకులపై మరణశిక్షను విధించుటకు మానవుని నియమించినప్పుడు అట్టి అధికారాన్ని ఆ మానవునికి దేవుడు ఇస్తాడు. ఆ వ్యక్తి అప్పుడు చెడుతనము చేయువారిపై తన శిక్షను అమలుచేయుటకు దేవుని ఆయుధంగా మారతాడు; కనుక, అట్టివానిపై ఎటువంటి నేరము మోపకూడదు.

**వచనం 7**. ఈ వాక్యములోని మొదటి భాగము 9:1లోని ఆజ్ఞను పునరావృతం చేయుటతో ముగుస్తుంది, కాని కొన్ని హెచ్చరిక మాటలను కూడా అక్కడ కలుపుతుంది. దేవుడు, **మీరు ఫలించి అభివృద్ధి నొందుడి; మీరు భూమిమీద సమృద్ధిగా సంతానము కని విస్తరించుడని వారితో చెప్పెను**. జలప్రళయమును తప్పించుకున్నవారి జీవన శైలి నెఫీలుల కాలములో (6:4) వారు చేసిన చెడుతనమునకు పూర్తి వ్యత్యాసంగా ఉంది. జీవమును నాశనం చేసిన జలప్రళయము మునుపటి నరహంతకులతో పోలిస్తే నోవహు మరియు అయన కుటుంబికులు, ఆదిలోని ఆదాము మరియు హవ్వల వలె (1:28) జీవమును అందించేవారిగా మరియు విస్తరింపజేసేవారిగా ఉండవలసియుంది.

9:7లోని ఆజ్ఞ బహువచనంలో ఉన్న సర్వనామంతో ప్రారంభమౌతుంది, కాబట్టి ప్రారంభ పదము మీమట్టుకైతే అని చెప్పవచ్చు. ఇది ప్రధానంగా నోవహు కుమారులను ఉద్దేశించింది. ఎందుకంటే, జనముల పట్టికలో ఇచ్చినట్లుగా (10:1–31) జనములను కనుటకు మరియు భూమిని తిరిగి జనాభాతో నింపుటకు వారు నియమించబడ్డారు.

## దైవిక నిబంధన మరియు సూచన (9:8–17)

### నిబంధన (9:8–11)

**8మరియు దేవుడు నోవహు అతని కుమారులతో 9ఇదిగో నేను మీతోను మీ తదనంతరము మీ సంతానముతోను మీతోకూడనున్న ప్రతి జీవితోను. 10పక్షులేమి**

**పశువులేమి మీతోకూడ సమస్తమైన భూజంతువులేమి ఓడలోనుండి బయటికి వచ్చిన సమస్త భూజంతువులతోను నా నిబంధన స్థిరపరచుచున్నాను. [11]నేను మీతో నా నిబంధన స్థిరపరచుదును; సమస్త శరీరులు ప్రవాహ జలములవలన ఇకను లయపరచబడరు; భూమిని నాశనము చేయుటకు ఇకను జలప్రవాహము కలుగదని పలికెను.**

**వచనం 8**. నోవహు మరియు అతని కుటుంబము ఓడలోనికి ప్రవేశింపకముందు, దేవుడు వారితో ఒక వాగ్దానపూర్వకమైన నిబంధన చేసాడు (6:18). రాబోవు జలప్రళయపు నీటినుండి వారిని కాపాడతానని వారికి వాగ్దానం చేసాడు. ఆయన దానిని నెరవేర్చాడు, కాని ఆ వాగ్దానములో మరింత దాగి ఉంది.

పవిత్రపరచబడిన ప్రపంచంలో వారు తమ హృదయములలో ఉంచుకొనవలసిన కొన్ని భాగ్యాలను మరియు నిషేధాలను **నోవహు మరియు అతని కుమారులతో** దేవుడు మాట్లాడిన తరువాత, **దేవుడు** ఒక నూతన విషయము చెప్పసాగాడు. వారికొరకు ఎక్కువ హెచ్చరికలు యిచ్చుటకు బదులుగా వారి తరపున ఆయన తలపెట్టదలచిన కొన్ని క్రియలను దేవుడు వారికి బయలుపరచాడు.

**వచనం 9**. దేవుడు ఒక **నిబంధనను** వారితోనూ మరియు వారి సంతానముతోనూ **స్థిరపరుస్తానని** (קוּם, *qum*) లేదా "ధృవీకరిస్తానని"[5] ప్రకటించాడు. హెబ్రీ క్రియాపదమైన *qum* అనేది కారకరూపంలో ఉన్నది గనుక అక్షరాలా దాని అర్థం "నిలబెట్టడం, లేదా ఎత్తడం."[6] దేవుడు ఆ ఓడలోని వారితో ఒక నూతన సంబంధాన్ని (నిబంధనను) "నిలువబెట్టాడని," లేదా ఈ సందర్భంలో, ఆయన 6:18లో నోవహుతో చేసిన మూల నిబంధన వాగ్దానంలో చెప్పబడినవి ఇప్పుడు అమలు చేస్తాడని లేదా పరిపూర్ణం చేస్తాడని లేదా వాటిని జరిగిస్తాడని దీనికి అర్థం.

**వచనాలు 10, 11**. ఈ నిబంధన సమస్త **పక్షులను**, **పశువులను**, **సమస్తమైన భూజంతువులను ఓడలోనుండి బయటికి వచ్చిన సమస్తమును ఇనుమడించి ఉంది. మరెన్నడు జలప్రళయము యొక్క నీటితో సమస్త శరీరులు మరియు** భూమి నాశనం కాదు అనేది దేవుని ఆజ్ఞ.

ఇది ఏకపక్ష నిబంధన, అంటే దానిని నెరవేర్చుటకు గల అవసరత పూర్తిగా దేవునిపైనే ఆధారపడి ఉంది. భవిష్యత్తులో మానవుడు ఎంతటి పాపిగా మారుతాడో (8:21 చూడండి) అనేదానితో సంబంధంలేకుండా, ఈ భూమిని సమూలంగా నాశనం చేయునట్లు ఇంకొక జలప్రళయమును దేవుడు పంపడు. ఒక విధంగా, ఈ నిబంధన షరతులు లేనిదై ఉంది; మానవుడు చేసే దానితో సంబంధం లేనిదై, ఈ వాగ్దానం ఎన్నడూ తప్పిపోదు. మరొక వైపు, మానవుడు ఈ భూమిపై సుదీర్ఘకాలం బ్రతికి భూమిని నింపి వెదకాలమును కోతకాలమును మున్నగు ఆశీర్వాదాలను

(8:22; 9:1,7) అనుభవించాలంటే నిషిద్ధమైన క్రియలను మానుకోవాలి. రక్తమును తినువారు మరియు నరహత్య చేయువారు సమస్తమైన చెడుతనము (9:4–6 చూడండి) నుండి పవిత్రపరచబడిన లోకమునకు చెందరు. భవిష్యత్తులో ఏదో ఒక సమయంలో దేవుని తీర్పు వచ్చే అవకాశం ఇంకను ఉంది, కాని అటువంటి తీర్పు ఒక సార్వత్రిక జలప్రళయము రూపంలో జరుగకపోవచ్చు.

**సూచన (9:12–17)**

**12మరియు దేవుడు నాకును మీకును మీతోకూడనున్న సమస్త
జీవరాసులకును మధ్య నేను తరతరములకు ఏర్పరచుచున్న నిబంధనకు
గురుతు ఇదే. 13మేఘములో నా ధనుస్సును ఉంచితిని; అది నాకును భూమికిని
మధ్య నిబంధనకు గురుతుగా నుండును. 14భూమిపైకి నేను మేఘమును
రప్పించునప్పుడు ఆ ధనుస్సు మేఘములో కనబడును. 15అప్పుడు నాకును
మీకును సమస్త జీవరాసులకును మధ్యనున్న నా నిబంధనను జ్ఞాపకము
చేసికొందును గనుక సమస్త శరీరులను నాశనము చేయుటకు ఆలాగు
ప్రవాహముగా నీళ్లు రావు 16ఆ ధనుస్సు మేఘములో నుండును. నేను దాని
చూచి దేవునికిని భూమిమీదనున్న సమస్త శరీరులలో ప్రాణముగల ప్రతి దానికిని
మధ్యనున్న నిత్య నిబంధనను జ్ఞాపకము చేసికొందుననెను. 17మరియు దేవుడు
నాకును భూమిమీదనున్న సమస్తశరీరులకును మధ్య నేను స్థిరపరచిన
నిబంధనకు గురుతు ఇదే అని నోవహుతో చెప్పెను.**

**వచనాలు 12, 13.** నోవహు మరియు అతని కుటుంబము చెడుతనము చేయువారిని తుడిచివేయుటకు దేవుడు పంపిన జలప్రళయములో దేవుని గొప్ప శక్తిని చూసారు మరియు అట్టి వైపరీత్యంలో నాశనం కాకుండా రక్షింపబడుటలో దేవుని అద్భుతమైన కృపను కూడా వ్యక్తిగతంగా అనుభవించారు. అటువంటి పని మరల చేయను అని దేవుడు వారితో చేసిన వాగ్దానం వారికి సరిపోయి ఉంటుంది. భవిష్య **సంతానములు** వేరుగా స్పందించవచ్చు గనుక, దేవుడు ఈ **నిబంధన** వాగ్దానమును ఒక **సూచనతో ముద్రించాడు** (9:17పై వివరణ చూడండి). **ఆయన మేఘములో ఒక ధనుస్సును** ఉంచుతానని చెప్పాడు.

**వచనాలు 14, 15. ధనుస్సు** (קֶשֶׁת, *qesheth*) అనే పదము విలుకాని విల్లును మరియు ఇంద్రధనుస్సును సూచిస్తుంది గనుక,[7] కొంత మంది పండితులు ఇక్కడ దేవుడు తన శత్రువులపై ఒక గొప్ప విల్లుతో బాణములను లేదా మెరుపులను సంధించే (కీర్తనలు 7:13; 18:14; హబక్కూకు 3:11) ఒక యోధుడుగా ఉన్నాడనే అలంకారం ఉన్నదని (నిర్గమ. 15:3; యెష. 42:13; జెఫన్యా 3:17) అంటారు. జలప్రళయము తరువాత దేవుడు **ఇంకొక గొప్ప జలప్రళయముతో మరలా** ఎన్నడు ... **నశింపజేయనని మానవునికి**

**పునఃనిశ్చయత** ఇచ్చుటకు తన విల్లును మేఘములో తగిలించాడని వారు ప్రతిపాదిస్తున్నారు. అయినను, బైబిల్లో లేదా ఇతర బాహ్య రచనలలో ఇటువంటి విల్లు అలంకారానికి నోవహు కాలము తరువాత చాలా కాలము వరకు ఎటువంటి ఆధారం లేదు.[8] దేవుడు నోవహుకు బయలుపరచిన దానికంటే విల్లునకు ఉన్న ప్రాధాన్యత గూర్చి మనం ఎక్కువ ఆలోచించడం సందేహాత్మకమైనది. జలప్రళయము నేపథ్యంలో, అది యుద్ధంలో ఒక జయకేతనము కాదు, కాని దేవుని కృపకు ఒక జ్ఞాపిక మరియు ఆయన మరల ఎన్నడు నీటి వలన మరొక జలప్రళయము రప్పించి **సమస్త శరీరులను** నశింపజేయనని ఆయన చేసిన వాగ్దానము పట్ల నమ్మకంగా ఉన్నాడనడానికి ఒక గురుతు.

**వచనం 16**. దేవుడు ఆ **ధనుస్సును మేఘములో ఉంచును ... నిత్య నిబంధనను జ్ఞాపకము చేసుకొనును** అనే వాక్యము దేవునికి మరియు ఆయన ప్రజలకు మధ్యనున్న సంబంధమును గూర్చి ఉపయోగించిన పరిభాషవలె ఉంది. "జ్ఞాపకము" (זָכַר, *zakar*) అనే పదము దేవునికి తాను చేసిన వాగ్దానము మర్చిపోయే ప్రమాదమున్నది గనుక తనకు ఆ వాగ్దానమును జ్ఞాపకము చేయుటకు ఒక గురుతు మేఘములో ఆయనకు కావలసియుంది అని అర్థం కాదు. ఆ విధంగా కాకుండా, దేవుడు తమకు బదులుగా "నిబంధనలో యథార్థతను వెల్లడి"[9] చేస్తాడని ఆ ధనుస్సు మానవాళికి పునఃనిశ్చయతను ఇస్తుంది.

ఆదికాండము 19:29లో సొదొమ మరియు గొమొఱ్ఱాల మీద అగ్ని మరియు గంధకములు పడినప్పుడు లోతును రక్షించుటకు దేవుడు కార్యం చేసినప్పుడు "దేవుడు అబ్రాహామును జ్ఞాపకము చేసుకొనెను" అని ఉంది, అనగా, పితరునితో అయన చేసిన నిబంధన వాగ్దానమును జ్ఞాపకం చేసుకొనెను. ఇంకా, దేవుడు తన "నిబంధన"ను "జ్ఞాపకము" చేసుకున్నాడనియు మరియు వారిని "ఐగుప్తీయులు మోయించు బరువుల" నుండి "విమోచించు"టకు ఆయన క్రిందికి దిగి వచ్చాడనియు (నిర్గమ. 6:5–7) ప్రజలతో చెప్పవలెనని దేవుడు మోషేతో చెప్పాడు. అలాగే, నోవహు చరిత్రలో, దేవుని జ్ఞాపకము చేసుకొనుట చాలా ప్రాముఖ్యం, మరియు పితరుని గూర్చిన చరిత్ర ఆ జ్ఞాపకముపై ఆధారపడి ఉండుట ఇది రెండవ సారి. 8:1లో, తగిన సమయములో జలప్రళయము నీటిని తగ్గించి భూమి మరలా నింపబడునట్లు దేవుడు చేసినప్పుడు "దేవుడు నోవహును జ్ఞాపకము [*zakar*] చేసుకున్నాడు" అని లేఖన భాగం చెబుతుంది. జలప్రళయములో దేవుడు నోవహును జ్ఞాపకము చేసుకొనుట, మరియు దాని తరువాత మేఘములో ఉన్న ధనుస్సు, నోవహుకు మరియు భవిష్యత్తు తరములందరికి దేవుడు తన నిబంధన వాగ్దానములకు నమ్మదగినవాడనే నిశ్చయతను కలుగజేసాయి. ఆయన నిబంధనలు ఆయన ప్రవర్తనలో పాతుకొని ఉన్నాయి.

**వచనం 17. ఆ ధనుస్సును దేవుడు** (ఆయనకు మరియు) **భూమిమీదనున్న సమస్త శరీరులకును మధ్య స్థిరపరచిన నిబంధనకు గురుతుగా** ఉండుటకు ఇచ్చాడు. ఇక్కడ ప్రయోగించబడిన "గురుతు" (אוֹת, *'oth*) అనే పదం చాలా వాక్యభాగాలలో కనబడుతుంది, ముఖ్యంగా ఐగుప్తులో, అరణ్యములో మరియు కనాను దేశాన్ని స్వతంత్రించుకున్న క్రమంలో (నిర్గమ. 7:3; సంఖ్యా. 14:11, 22; ద్వితీ. 4:34; 11:3; యెహో. 24:17, 18) దేవుడు చేసిన ఆశ్చర్య క్రియలను గూర్చిన చోట కనిపిస్తుంది. *'oth* (గురుతు) యొక్క అద్భుతములను సూచించని అర్థం ప్రత్యేక కార్యములలో కూడా కనబడుంది, అంటే: సున్నతి (ఆది. 17:11), నిర్గమము తరువాత సినాయి పర్వతము మీద ఇశ్రాయేలీయులు యెహోవాను ఆరాధించుట (నిర్గమ. 3:12), ఐగుప్తులో ఇశ్రాయేలీయులు తమ గుమ్మముల మీదను ద్వార బంధకముల మీదను పూసిన రక్తము (నిర్గమ. 12:7, 13), విశ్రాంతి దినము (నిర్గమ. 31:16, 17), ఇంకా ప్రవక్తలు చేసిన అనేక సూచక క్రియలను గూర్చి ప్రయోగించబడింది (యెష. 20:3; యెహెజ్కేలు 4:3).

ప్రజలు సూచక క్రియల ప్రాముఖ్యతను గుర్తెరుగులాగున ఎల్లప్పుడూ దేవుని ప్రత్యక్షత వెలుగులో అవి విశదీకరించబడాలి. "ఒక సూచక క్రియను వివరించుటకు సరియైన వాక్యము యొక్క బయలుపాటు లేకుండా సూచక క్రియల ప్రత్యక్షత ఎన్నడు లేదు."[10] సూచక క్రియలనేవి అద్భుతాలకు సంబంధించినవైనను అద్భుతాలకు సంబంధించినవి కాకున్నను, అవి దేవుని సన్నిధిని మరియు ఉద్దేశాన్ని చూపిస్తాయి, ఇంకా కొన్నిసార్లు మానవునిపై ఉంచబడిన దైవిక ఆంక్షలను కూడా సూచిస్తాయి. ధనుస్సు విషయంలో, అది ఒక జ్ఞాపికయై, నోవహు దినములలో నీటిని జలప్రళయముగా చేసి భూలోకమంతటిని నాశనం చేసినట్లు భవిష్యత్తులో మరలా జరగకుండా దేవుడు ప్రతి జీవితో చేసిన నిబంధనకు ఒక సూచనగా అది ఉంది. రాబోవు తరములన్నిటికి దేవుని కరుణ మరియు కృపలకు ధనుస్సు ఒక గురుతుగా మారింది, ప్రత్యేకంగా భూమిపై తరువాతి కాలంలో అపాయములో ఉన్న తన ప్రజలకు సంభవించిన తాత్కాలిక తీర్పులకు (అంటే చెర మరియు హతసాక్షి) అది గురుతుగా ఉంది (యెహెజ్కేలు 1:28; ప్రకటన 4:3; 10:1 చూడండి).

దేవుడు "ధనుస్సును ... మేఘములో" తన "నిత్య నిబంధన"కు ఒక "గురుతు"గా (9:16) ఉంచడం అంటే నోవహు ఓడలో నుండి బయటకు రావడానికి మునుపు మేఘములలో ఎన్నడు ధనుస్సు కనబడలేదు అని కాదు. దానికి మునుపు లేని ఒక ప్రత్యేకమైన ప్రాధాన్యతను దేవుడు ధనుస్సుకు ఇచ్చాడని మాత్రమే దాని భావము. అబ్రాహాము కథలో కూడా ఇటువంటి పరిస్థితే కనిపిస్తుంది. విశ్వాసులకు తండ్రి దేవునితో అనేక సంవత్సరాలు నడచిన తరువాత, దేవుడు ఆయనకు మరియు "వారి తరములలో ... సంతతికి" సున్నతి అనే గురుతు ఇచ్చాడు (ఆది. 17:9–14). పురావస్తుశాఖ అధ్యయనంలో

పితరులకు ముందు జీవించిన ప్రజల మధ్య ఒక వ్యక్తి పురుషునిగా ఎదిగే మునుపు పూర్వాంగ చర్మము కత్తిరించే ఆచారం అంతకు ముందే ఉండేదని తెలుస్తుంది.[11] తొంబై తొమ్మిది సంవత్సరముల వయసులో అబ్రాహాము ఈ సున్నతిని స్వీకరించినప్పుడు, దేవుడు తన ప్రజలతో చేసుకున్న నిబంధనకు ఒక భౌతికపరమైన గురుతుగా అది మారింది.

అదే విధంగా, సినాయి పర్వతము మీద ఇశ్రాయేలీయులు విశ్రాంతి దినమును గూర్చిన ఆజ్ఞను స్వీకరించినప్పుడు, అది అరణ్యములో వారు ముందుగానే ఆచరించినప్పటికీ (నిర్గమ. 16:22–30) దేవుడు తన ప్రజలతో చేసిన నిబంధనకు ఒక గురుతుగా (*'oth*) అది నూతన అర్థాన్ని పొందుకుంది (నిర్గమ. 31:16, 17). కాబట్టి, అబ్రాహాము లేదా ఇశ్రాయేలు కాలమునకు చాలా ముందే, దేవుడు ధనుస్సును నోవహు తరువాత వచ్చిన మానవులందరితో చేసుకున్న నిబంధనకు ఒక అర్థవంతమైన గురుతుగా (*'oth*) మార్చాడు. దేవుడు తన వాగ్దానములను ఎల్లప్పుడూ నిలబెట్టుకుంటాడు గనుక, భూమిని నింపి ప్రతి జీవిని నాశనం చేయునట్లు భయంకరమైన జలప్రళయ వినాశనాన్ని ఎన్నడు చేయడు.

## నోవహు శాపము మరియు ఆశీర్వాదము (9:18–29)

దేవుని యొక్క స్వచ్ఛమైన మరియు క్రొత్తదైన ప్రపంచంలో కూడా, మానవుడు పాపము చేసే విషయంలో, అవినీతికిని మరియు వివేచనారహిత తీర్పును చేయుటకుగల తన వేగిరపాటును వృద్ధిచేసుకొనుటకు ఎక్కువ సమయం పట్టలేదు. లోకము తిరిగి జనాభాతో నింపబడుతుండగా, ప్రజలు తమ దైనందిన జీవితాలలో దైవత్వమునకును మరియు పాపమునకును మధ్య వారు తీసుకోవాల్సిన ఎంపికల విషయంలో అది ఇంతకుముందు జరిగినట్లుగానే ఇంకను జరుగనైయుంది.

### నోవహు యొక్క వంశావళి (9:18, 19)

**18ఓడలోనుండి వచ్చిన నోవహు కుమారులు షేము హాము యాపెతనువారు; హాము కనానుకు తండ్రి. 19ఈ ముగ్గురు నోవహు కుమారులు; వీరి సంతానము భూమియందంతట వ్యాపించెను.**

**వచనం 18**. జలప్రళయమును గూర్చిన చరిత్ర నోవహు మరియు అతని ముగ్గురు కుమారులైన "షేము, హాము, యాపెతు" అనువారి (6:9, 10) ప్రస్తావనతో ప్రారంభమైంది. అదే విధంగా, అది ఆ పితరుని మరియు అతని సంతానమును గూర్చిన మరొక ప్రకటనతో ముగుస్తుంది: **ఓడలోనుండి వచ్చిన**

**నోవహు కుమారులు షేము హాము యాపెతనువారు. ఇంకా అది హాము కనానుకు తండ్రి అనే** వాక్యాన్ని జోడిస్తుంది, ఇది 9:25లోని నోవహు శాపమును ముందే ఊహిస్తుంది. కనానును గూర్చిన ఈ వాక్యము భవిష్యత్తులో అబ్రాహాము సంతానము (ఇశ్రాయేలీయులకును) మరియు వాగ్దాన దేశములోని కనానీయులకును రాబోయే పోరాటాలను ముందుగానే హెచ్చరిస్తుంది.

**వచనం 19**. "నోవహు కుమారులను" గూర్చి రచయిత మాట్లాడుతూ, వీరి సంతానము భూమియందంతట వ్యాపించెను అని అంటున్నాడు. ఈ కుటుంబముల యొక్క వృద్ధి దైవిక ఆశీర్వాదము, అంటే "మీరు ఫలించి అభివృద్ధి పొంది భూమిని నింపుడి" (9:1) అనే ఆజ్ఞతో కూడా కలిపి, వారి జీవితాలలో క్రియ జరిగిస్తుందని తెలుస్తుంది.

## నోవహు యొక్క అవిజ్ఞత (9:20, 21)

**[20]నోవహు వ్యవసాయము చేయనారంభించి; ద్రాక్షతోట వేసెను. [21]పిమ్మట ద్రాక్షారసము త్రాగి మత్తుడై తన గుడారములో వస్త్రహీనుడుగా నుండెను.**

**వచనం 20**. జలప్రళయము తరువాత **నోవహు** తనను మరియు తన భార్యను పోషించవలసియున్నందున, **ఆయన వ్యవసాయము చేయనా రంభించి, ద్రాక్షతోట వేసెను**. హెబ్రీ మూల వాక్యంలో "నేలకు చెందినవాడైన నోవహు ప్రారంభించి ద్రాక్షతోటను వేసెను అని ఉంది."[12] RSVలో "నోవహు మట్టిని సాగుచేసినవాడిలో మొదటివాడు" అని ఉంది, ఇతర అనువాదాలు, నోవహు "ద్రాక్ష తోట నాటుటలో మొదటివాడు" (NRSV; NJPSV) అని సూచిస్తున్నాయి. *The Jewish Study Bible* మాత్రం నోవహు "ద్రాక్షలను పండించిన మొదటి వ్యక్తిగా" "అధిక మద్యపానము వలన కలిగే అనర్థాలను ఎరిగి ఉండడు" అని చెబుతుంది.[13]

ఆదాము మరియు కయీను అనువారు దాదాపుగా ఆదినుండే భూమిని సాగు చేసారు గనుక (2:15; 3:17–19; 4:2, 3) నోవహు "మట్టిని సాగు చేసినవారిలో ప్రథమునిగా" చూడడం ఎలాగో చాలా కష్టంగా ఉంది. దీనికి తోడు, "ద్రాక్షతోట నాటినవారిలో నోవహు ప్రథముడు" [14] అని లేఖనము చెప్పుట లేదు; లేదా అధిక మద్యము పానము చేయుటవలన మత్తుపడిన వారిలో ఆయన ప్రథముడు అని కూడా చెప్పుటలేదు. అటువంటి ప్రయోగాలు నోవహు మద్యపానమును క్షమించి ప్రతి తప్పిదమునుండి అతనిని కాపాడే ప్రయత్నాలుగా ఉన్నాయి. సృష్టి నుండి అప్పటివరకు గతించిన కాలమంతటిలో చూస్తే, ద్రాక్షరసమును ఒక పానముగా ఉపయోగించడం నోవహు కాలము వరకు జరగలేదు అని అనడం నిజంగానే వింతగా ఉంటుంది. ఎక్కువగా సాధ్యపడే వ్యాఖ్యానం ఏమంటే, "నోవహు తాను ముందుగానే ఏ మొక్క సాగు మరియు ఉపయోగాలను ఎరిగియున్నాడో ఆ సాగునే చేసాడు."[15]

**వచనం 21.** నోవహు దేవునితో నడచిన ఒక నీతిమంతుడైనప్పటికీ, ఆయన పాపమునకు అతీతుడని మనం అనుకోకుండునట్లు జాగ్రత్త పడాలి. **నోవహు ద్రాక్షారసము త్రాగి మత్తుడై యున్నాడని** ఇక్కడ వాక్యము స్పష్టంగా చెప్తుంది. తన త్రాగిన మైకంలో నోవహు **తన గుడారములో వస్త్రహీనుడుగా** ఉన్నాడు. తన గుడారములో నోవహు ఎందుకు వస్త్రహీనుడుగా ఉన్నాడో మనకు చెప్పబడలేదు. ప్రాచీన పశ్చిమ ఆసియా మరియు మధ్యధరా ప్రాంతంలో వేడిమిగల వాతావరణంలో ఒకని గుడారంలో వివస్త్రలుగా పండుకోవడం అసాధారణమైనది కాదు (ప్రకటన 16:15).[16] నోవహు యొక్క దిగంబరత్వము స్పష్టంగా వ్యత్యాసంగా ఉంది. కొందరు ఆయన తన భార్యతో లైంగిక సంబంధంలో పాల్గొనుటకు సిద్ధపడుతున్నాడని లేదా మద్యపానము తన విజ్ఞతను కోల్పోయేలా చేసి తన ఆలోచనను కుంటుపరచినందున విపరీత ధోరణిలో ప్రవర్తించాడని అంటారు.

## హాము యొక్క పాపము (9:22, 23)

[22]**అప్పుడు కనానుకు తండ్రియైన హాము తన తండ్రి వస్త్రహీనుడై యుండుట చూచి బయటనున్న తన యిద్దరు సహోదరులకు ఆ సంగతి తెలిపెను.** [23]**అప్పుడు షేమును యాపెతును వస్త్రమొకటి తీసికొని తమ యిద్దరి భుజములమీద వేసికొని వెనుకకు నడిచి వెళ్లి తమ తండ్రి దిసమొలను కప్పిరి; వారి ముఖములు వెనుకతట్టు ఉండుటవలన తమ తండ్రి దిసమొలను చూడలేదు.**

**వచనం 22.** మరియొక సారి, **హాము కనానునకు తండ్రిగా** గుర్తించబడ్డాడు (9:18), ఆయన **తన తండ్రి వస్త్రహీనుడై యుండుట చూచెను** అని చెప్పబడింది. నిజానికి తన తండ్రి గుడారములో ప్రవేశించు అవసరత అతనికి లేదు. ఆ గుడిసెలో ఏదో ఒక తప్పిదము జరుగుతుందని అతడు అనుమానించాడా? అతడు ఏదో తెలుసుకోవాలని ఆసక్తిని కలిగి ఉన్నాడా లేక తన తండ్రినే పణంగా పెట్టి ఏదైనా వికృత భావోద్వేగాన్ని కోరాడా? తన తండ్రి గుడిసెలోనికి ప్రవేశించుటలో హాము యొక్క ఉద్దేశాలు మనకు తెలియవు, ఎందుకంటే ఈ లేఖన భాగం దానిని మనకు బయలుపరచలేదు. మనకు తెలిసింది ఏమంటే, ఆదాము మరియు హవ్వలు పాపము చేసిన పిదప వారి దిగంబరత్వమును బట్టి వారు కొంచెం సిగ్గునొందారు (3:7, 10). తరువాత, ధర్మశాస్త్రంలో అసభ్యకరమైన ప్రదర్శనను గూర్చి యాజకులు హెచ్చరించబడ్డారు (నిర్గమ. 20:26; 28:42). ఇంకా, వాటిని గూర్చి చేసిన చట్టములో, ఒకని భాగస్వామిని తప్ప వేరేవారిని మానాచ్ఛాదనము (మర్మాంగాలను చూడడం) చేయడం నిషిద్ధం (లేవీ. 18:6–18).

హాము పాపమును గూర్చి ఇతర ఆలోచనలు కూడా ప్రతిపాదించ బడ్డాయి. తన తండ్రితోనే లైంగిక సంబంధం చేయుటకు హాము ప్రయత్నించాడని కొందరు అంటారు. ఇంకొందరు తన తండ్రితో పాటు తన తల్లితో శయనించాలని హాము

అనుకున్నట్లుగా అంటారు; దీనికి మద్దతిచ్చే వారు లేవీయకాండము 18:7వ వచనం చూపుతారు. లేఖనము "తండ్రి మానాచ్ఛాదనము"నకు వ్యతిరేకంగా చట్టం చేసినప్పుడు, ఒకని తల్లితో లైంగిక సంబంధమునకు వ్యతిరేకంగా ఆ వాక్యం మాట్లాడుతున్నట్లు అర్థం. ఇటువంటి ఆలోచనలు అన్నియు అధికవివరణములు; ఇందలి వాక్యము హాము "తన తండ్రి దిగంబరత్వమును చూచినప్పుడు," **బయటనున్న తన యిద్దరు సహోదరులకు** ఆ సంగతి తెలిపెను అని మాత్రమే చెప్తుంది.

హాము తన సహోదరులతో ఏమి చెప్పాడో ఎటువంటి భావంతో చెప్పాడో లేఖన భాగం ఏమి చెప్పుటలేదు. ఆయన వారిని తన తండ్రి మానచ్ఛాదనము చూసి రహస్యముగా ఆనందపడడానికి వారిని ఆహ్వానిస్తున్నాడా?[17] తన తండ్రి యొక్క త్రాగుడు ప్రవర్తనను ఆయన పరిహాసం చేస్తున్నాడా? హాము తన సహోదరులకు ఏమి చెప్పాడో గాని, అది బహుశా వృద్ధుడైన తన తండ్రిని వెక్కిరించినట్లుగా ఉండి అతని అవమానించుటకు చేసినట్లుంది. హామునకు తన తండ్రి యొక్క జీవితంలో బలహీన క్షణాలలో కూడా ఎటువంటి సానుభూతి లేనట్లుగా ఉంది. తరువాత, ప్రవక్తయైన హబక్కుకు "తమ పొరుగువాని మానము చూడవలెనని" ప్రజలను మత్తుపరచువారిని గద్దించాడు (హబక్కుకు 2:15). హాము నోవహును ద్రాక్షరసంలో మిగులత్రాగులాగున చేశాడని మనకు చెప్పబడలేదు కాని, ఆ విచారకరమైన సంఘటన చూసి అతడు ఆసరా తీసుకుని, తనకు మానాచ్ఛాదనము చేయుటద్వారా అవమానము కలుగజేశాడు. ఇంకా, తన సహోదరులకు దానిని చెప్పి తన తండ్రి మానమును చూచుటకు వారిని ఆహ్వానించుట ద్వారా తన పాపమును ఇంకా రెట్టింపు చేసుకున్నాడు.

హాము పాపము యొక్క అసలైన గుణమును లేఖనములు మనకు చెప్పకున్నపటికి, తన తండ్రి పక్షాన తన ప్రవర్తన నిశ్చయముగా సరైనది కాదు. ప్రాచీన ప్రపంచంలో, అలాగే మిక్కిలి సంప్రదాయబద్ధమైన నేటి సమాజాలలో కూడా, తమ తల్లిదండ్రులను గౌరవించడం పిల్లలకు ఇవ్వబడిన గొప్ప బాధ్యతగా ఉంది. దేవుడు ఈ బాధ్యతను ఈ క్రింది పదాలతో పది ఆజ్ఞలలో కూడా ఉంచాడు: "నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము" (నిర్గమ. 20:12). ఇంకా, వాగ్దాన దేశంలో చేరే ముందు ఇశ్రాయేలీయులకు ఇచ్చిన సలహాలలో కూడా, తన తండ్రిని గాని తన తల్లిని గాని గౌరవించని వారిపై ఒక ప్రత్యేకమైన శాపాన్ని మోషే కలిపాడు. ఈ హెచ్చరికలకు స్పందిస్తూ, ప్రజలందరూ తమ సమ్మతిని "ఆమెన్" అనే మాటతో తెలపాలి (ద్వితీ. 27:16).

తన తల్లిదండ్రులు బుద్ధిమాలిన పని చేసినప్పుడు పిల్లలు ఎలా స్పందించాలో అనే విషయం గురించి పాత నిబంధన ఎటువంటి నియమావళి ఇవ్వలేదు, కాని ఇశ్రాయేలీయులు Ugaritic Aqhat కథతో ఏకీభవించి ఉంటారు, అందులో కుమారుడు తన తండ్రి "మద్యపానము చేసినప్పుడు చేతిలో ఎత్తుకొని,

మద్యముతో మత్తుడై ఉన్నప్పుడు తనను మోస్తాడు" అని ఉంది.[18] మరొక మాటలో, బలమైన పానము వలన ఒకని తండ్రి విజ్ఞత కోల్పోతే విశ్వసనీయుడైన కుమారుడు తనను నిలువబెట్టి తనకు సహాయము చేస్తాడు; మరియు అతనిని వెక్కిరించే వారి మధ్యనుండి తనను వేరే ప్రదేశమునకు తీసుకెళ్లుట ద్వారా తనకున్న పేరుప్రతిష్టలను నిలబెడతాడు.

**వచనం 23. షేము మరియు యాపెతు తమ** సహోదరుడు చేయదలచిన దానిలో పాలుపొందకుండా, ఒక ఇబ్బందికరమైన మరియు నీతిలేని క్రియనుండి తప్పించుటకు వారు పూనుకున్నారు. **వారు వస్త్రమొకటి తీసికొని** తమ యిద్దరి భుజములమీద వేసికొని వెనుకకు నడిచి **వెళ్లి తమ తండ్రి దిసమొలను చూడకుండా ఉండునట్లు తమ ముఖములు** వెనుకకు పెట్టి తమ తండ్రి దిసమొలను కప్పిరి. హాము చేసిన పాపము ఏమైయుంటుందో అని అనేకులు చేసిన సంచలనాత్మక ప్రతిపాదనల మధ్య, ఇక్కడి లేఖన భాగము హాము తన తండ్రి వివస్త్రునిగా మరియు పానము చేసిన వానిగా ఉండగా "చూచెను" అనియు; తన సహోదరులు అట్టి తమ తండ్రి స్థితిని "చూడలేదు" అనియు వ్రాయబడి ఉంది. ఆ గుడారములోనికి వెనుకగా నడచివెళ్లి తమ తండ్రిని కప్పుటద్వారా కనీసం అనుకోకుండా కూడా తన తండ్రిని వివస్త్రునిగా చూడకుండా ఉండుటకు వారు తగు జాగ్రత్తలు తీసుకున్నారు. తనను చూడకుండా ఆయనను కప్పుట ద్వారా, షేము మరియు యాపెతు తమ తండ్రిని గౌరవించి అట్టి తన బహిర్గత మరియు బలహీన పరిస్థితిలో ఇతర కన్నులు తనపై పడే అవకాశాన్ని వారు తప్పించారు.

## హాము కుమారుడైన కనానుపై నోవహు శాపము (9:24, 25)

**24అప్పుడు నోవహు మత్తునుండి మేలుకొని తన చిన్నకుమారుడు చేసినదానిని తెలిసికొని–**

**25కనాను శపింపబడినవాడై తన సహోదరులకు దాసాను దాసుడగును అనెను.**

**వచనం 24**. కొంత సమయము తరువాత, **ద్రాక్షరసము** యొక్క ప్రభావము నుండి **నోవహు** మేలుకొని హాము తనకు **ఏమి చేశాడో** [עָשָׂה, *'aśah*] తెలుసుకున్నాడు. ఇక్కడి క్రియాపదము "చేశాడు" (*'aśah*) కొన్నిసార్లు హాము తన తండ్రికి వ్యతిరేకంగా ఒక భౌతికపరమైన దూషణ–లైంగికపరమైనది కావచ్చు కాకపోవచ్చు–చేశాడనే అర్థమిచ్చునట్లు చెప్పబడుతుంది. ఈ సందర్భంలో, ఈ పదము తన గుడారములో మత్తులో మరియు వస్త్రహీనునిగా ఆయనను చూసిన విషయాన్ని తన సహోదరులకు (బహుశా వెక్కిరంతగా) చెప్పాడు అనే విషయాన్ని మాత్రమే ఈ పదం చెప్తుంది అని చెప్పవచ్చు. హాము ఇక్కడ నోవహు యొక్క **చిన్న కుమారునిగా చెప్పబడ్డాడు** (10:21పై గల వివరణ చూడండి).

**వచనం 25.** ఈ వచనం పరిశుద్ధ గ్రంథంలో నోవహు మాట్లాడిన మొట్టమొదటి మాటను నమోదు చేస్తుంది: “కనాను **శపింపబడినవాడై తన సహోదరులకు దాసాను దాసుడగును**.” ఇక్కడ స్పష్టంగా అంతుపట్టని విషయం ఏమంటే, ఆ శాపము వాస్తవానికి దోషియైన పితరుని కుమారుడైన హాము మీద పడకుండా తన మనుమడి మీద పడింది. ఇక్కడ కనాను ప్రస్తావించబడ్డాడు గనుక, కొందరు ఈ అనైతిక తతంగం అంతటిలో ఆయన పాత్ర కూడా ఉంది అని అంటారు; కాని ఈ వాక్యంలో అటువంటిది ఏమి చెప్పబడలేదు. నిజానికి, ఈ సత్యము మోషే సమయము వరకు అధికారికంగా చెప్పబడక పోయినప్పటికీ, దేవుడు “మూడు నాలుగు తరముల వరకు తండ్రుల దోషమును కుమారుల మీదికి రప్పించును” (నిర్గమ. 20:5) అనే విషయానికి ఇది ఒక ఉదాహరణగా ఉంది.

తన తండ్రి పాపమును బట్టి దేవుడు తన కుమారుని శిక్షిస్తాడు అనే విషయము చాలాసార్లు తృణీకరింపబడుతుంది, ఎందుకంటే ఒక తరమువారి పాపమును బట్టి ఇంకొక తరము వారిని శిక్షించడం అనేది చాలా పక్షపాతం వలెను అన్యాయంగాను కనబడుతుంది. వాస్తవానికి, ఒక తండ్రి ప్రవర్తన తన కుమారుని క్రియలను ముందుగానే తెలుపుతుంది అనే విషయాన్ని ఒక విధంగా చెప్పినట్లు కనిపిస్తుంది. పిల్లలు మరియు మనుమలు కొన్నిసార్లు–అన్నిసార్లు కాకపోయినా–తమ ప్రవర్తనలో, నైతికతలో, జీవన శైలిలో మంచికి కాని చెడుకి కాని తమ తల్లిదండ్రుల మరియు తాత–అవ్వల అడుగుజాడలలో నడుస్తుంటారు. ఒక విధంగా, పిల్లలు తమ తల్లిదండ్రుల పాపములను బట్టి బాధ అనుభవించవచ్చు; కాని సాధారణంగా వారి సొంత చెడు తీర్మానాలు మరియు అలవాట్లను బట్టే వారి మీదికి తమ పితరులు అనుభవించిన శాపాలు, బాధలు, ఇబ్బందులు పిల్లలు తెచ్చుకుంటూ ఉంటారు.

ముందుగా ఆదికాండములో చూచినట్లుగా, కయీను జీవితంలో ప్రసిద్ధిగాంచిన చెడు ప్రవర్తన, పగ, హింస మరియు బాధల పునరావృతం తన సంతానములో, ముఖ్యంగా లెమెకులో (4:1–24) కొనసాగుతూ వచ్చింది. దేవుడు పాత ప్రపంచములోనున్న అందరిని నాశనంచేయుటకు పంపిన జలప్రళయము వచ్చే వరకు (6:17; 7:23; 8:21 చూడండి) నెఫీలుల చెడుతనము (6:4) కొనసాగి ఉంటుంది. తమ తండ్రుల, మరియు బహుశా తాత–ముత్తాతల, పాపములు తరువాత కాలంలో వారిపై మోపబడ్డాయి. వారి ప్రవర్తన మరియు శిక్ష పక్షపాతంతో ముందుగానే నిర్ణయించబడలేదు, కాని వారి పితరుల జీవనవిధానంగా మారిన చెడుతనము వారు నోవహు యొక్క ప్రకటన విననొల్లకుండా ఉండునట్లు వారి జీవితాలను ప్రభావితం చేస్తూనే ఉంది కనుక వారు జలప్రళయములో నశించారు.

నోవహు మనుమడైన కనాను విషయానికొస్తే, ఈ శాపము తాను వ్యక్తిగతంగా అనుభవించబోయే చెడు విషయాలను గూర్చి మాట్లాడుటలేదు. మరింత విశదంగా చెప్పాలంటే, కొన్ని తరముల తరువాత తన సంతానమైన కనానీయుల మీదకు

వచ్చే, అనగా ఇశ్రాయేలీయులు వారిపై దండెత్తి ఆఖరుగా వాగ్దాన దేశాన్ని స్వతంత్రించుకున్న క్రమంలో వారిమీదికి వచ్చిన శాపాన్ని అది సూచిస్తుంది. ఈ ఆలోచన చాలా సరియైనదిగా ఉంది, ఎందుకంటే నోవహు కనాను మీద శాపాన్ని పలికినప్పుడు, "తన సహోదరులకు దాసాను దాసుడగును" అని పలికాడు. మనకు తెలిసినంత వరకు, హాము కాని తన కుమారుడైన కనాను కాని వ్యక్తిగతంగా తమ సహోదరులను సేవించలేదు; కాని హాము యొక్క పాపము "తన కుమారుడైన కనాను యొక్క సంతానమును (కనానీయులను) షేము మరియు యాపెతు అనువారి సంతానమునకు లోబడి సేవ చేయునట్లు" చేసింది.[19] హాము సంతానము వారి మీదికి త్రోయబడిన పక్షపాత విధికి బలైన అమాయక బాధితులు కాదు; ఆ శాపము వారి పైకి ఎందుకు వచ్చిందంటే వారు హామువలే ప్రవర్తించడమే కాదు తమ పితరుని కూడా అధిగమించి వారి విగ్రహారాధనా జీవన విధానాలకు ప్రతీకలైన అశ్లీల లైంగిక నేరాలు మరియు అధమమైన దుర్మార్గతలతో వారు నిండిపోయారు. ఇశ్రాయేలీయుల ద్వారా వారు కనాను దేశాన్ని పోగొట్టుకున్నారు. ఎందుకంటే, దేవుడు సహించనంతగా వారి అక్రమము సంపూర్ణమైంది (15:16; లేవీ. 18:3–30; ద్వితీ. 9:4–6 చూడండి).

## షేము మరియు యాపెతుపై నోవహు ఆశీర్వాదం (9:26, 27)

**26మరియు అతడు–**

> **షేము దేవుడైన యెహోవా స్తుతింపబడును గాక**
> **కనాను అతనికి దాసుడగును.**
> **27దేవుడు యాపెతును విశాలపరచును**
> **అతడు షేము గుడారములలో నివసించును**
> **అతనికి కనాను దాసుడగును**

**అనెను.**

**వచనం 26**. నేరస్తునిపై శాపము పలుకుటతో నోవహు ఆగలేదు. ఆయన ఇంకా, **షేము దేవుడైన యెహోవా స్తుతింపబడును గాక** అని పలికాడు. స్తుతినొందుటకు "షేము" కర్త కాదు; స్తుతి యెహోవాకు చేయబడింది. సాధారణంగా, అటువంటి స్తుతి భావాన్ని పలుకుటకు ప్రోద్బలాన్ని ఇచ్చిన దేవుని కార్యాన్ని గుర్తించుటకు దేవునికి స్తుతిని చెల్లించడం చూస్తాం. కాని అటువంటి ఒక వివరణ ఇక్కడ లేకపోవడం చూస్తే నోవహు యొక్క దేవుడు "షేమునకు దేవునిగా" ఉన్నందుకు "యెహోవాను" స్తుతిస్తున్నాడు లేదా కొనియాడుతున్నాడు అని చదువరి నమ్ముతాడు. నోవహు దానిని గ్రహించి ఉంటాడు, హామువలె కాకుండా, షేము దేవునికి సమర్పించబడిన వాడు. ఇంతకు ముందు షేతు (4:26) ద్వారా

వచ్చినట్లుగానే షేము ద్వారా దేవుని ఏర్పాటు వంశం కొనసాగుతుంది. నిజమే, 11:10–26లో ఇవ్వబడిన వంశావళిలో, అనగా అబ్రాహాము పిలుపుతో ముగిసే (12:1–3) భాగంలో ఇది పొందుపరచబడింది అని మనం చూడగలం.

షేము యొక్క దేవుడని దేవుని స్తుతించిన తరువాత, నోవహు, **కనాను అతనికి దాసుడగును** అని అన్నాడు. కనానీయులపై ఇశ్రాయేలు తదుపరి కాలంలో యుద్ధములు చేసి దేవుని ఏర్పరచబడిన జనాంగము తుది విజయాన్ని సాధించిన క్రమంలో కాకపోతే ఇక్కడ పితరుడు పలికిన మాటలు అర్థం చేసుకోవడం కష్టం. భవిష్యత్తులో కనాను అనుభవించే దాస్యపు విధి ఏకపక్షంగా హాము యొక్క పాపముపై కాదు కాని, మితిమీరిన వారి చెడుతనము మీదనే ఆధారపడి ఉంది. జలప్రళయము తరువాత ఆరంభమైన పాపమనే చిన్న కాలువ హాము వంశస్తులలో, అనగా కనానీయుల మధ్య, చెడుతనము మరియు విగ్రహారాధన అనే భయంకరమైన ప్రవాహముగా మారింది. అయినప్పటికీ, ఈ ప్రవచనం వందల సంవత్సరాల తరువాత వరకు, అనగా వారి చెడుతనము "సంపూర్ణం" (15:16) అయ్యేనంతవరకు నెరవేరలేదు.[20] దేవుడు తీర్పు విషయంలో సహనం వహించి మారుమనస్సు పొందుటకు కనాను వాసులకు సుదీర్ఘ అవకాశం ఇచ్చాడు (2 పేతురు 3:9 చూడండి).

**వచనం 27.** శాపము మరియు ఆశీర్వాదము తరువాత, నోవహు ఒక వేడుకోలు చేసాడు: **దేవుడు యాపెతును విశాలపరచును**. 9:26లో ఉన్న ఆశీర్వాదమునకు పోలియున్న ఈ విన్నపము కూడా, మున్ముందు రాబోవుచున్న గొప్ప సంఘటనలను గూర్చి మాట్లాడిన ఒక ప్రవచనంవలె తీసుకోవాలి కాని, కొందరు అనుకుంటున్నట్లుగా కనానును స్వతంత్రించుకున్న తరువాత ఆ కాలపు రచయిత మరల తన స్మృతులలో నుండి రాస్తున్న మాటలవలె కాదు.

27వ వచనం మొదటి భాగములో ఇంకొక హెబ్రీ పదచాతుర్యాన్ని చూడవచ్చు; అక్కడ పితరుడు యాపెతును (יֶפֶת, *Yepeth*) "విశాలపరచ"మని (יַפְתְּ, *yapth*$^e$) యెహోవాను వేడుకున్నాడు. యాపెతు కుటుంబము ఎలా విశాలపరచబడింది? నోవహు యొక్క ఈ కుమారుని నుండి ఎటువంటి ప్రజలు సంక్రమించారు? ఆదికాండము 10:2–5లో, యాపెతు ప్రాచీన Anatolia (అంటే మునుపటి Soviet Union లోని కొన్ని దక్షిణ సోపానాలతో కూడిన ఆధునిక టర్కీ) మరియు పశ్చిమములో గ్రీసు మరియు అనేక ఇండో–ఐరోపా ప్రజలతో కూడిన Aegean ప్రాంతంలోని ప్రజలకు[21] మూలపురుషునిగా కనబడతాడు.

తరువాత భాగం, "అతడు షేము గుడారములలో నివసించును," చాలా మామూలు మాటగానే కనబడుతుంది–కాని "అతడు" అనే పదం ఎవరిని సూచిస్తుంది? ఈ వాక్యభాగాన్ని అరామీ భాషలోనికి అనువదించేటప్పుడు, Targum of Onkelos యెహోవాను ప్రస్తావించి ఇంకా అంటుంది, "మరియు

ఆయన తన షెకీనాను షేము గుడారములలో ఉండునట్లు చేయును" అని.[22] క్రీ.శ. మొదటి లేదా రెండవ శతాబ్దమునకు చెందిన ఈ తరువాత కాలపు యూదియా వ్యాఖ్యానము దీని గూర్చి చాలా తక్కువ చెప్తుంది.[23] ఇంకా, అది వ్యాకరణంలోని మూల నియమము, అంటే ఒక సర్వనామము సాధారణంగా దానికి సమీపంగా ఉండే పూర్వపదాన్ని సూచిస్తుంది, అనే నియమమును ఉల్లంఘిస్తుంది. ఈ నియమమునకు కొన్ని మినహాయింపులు వేరేచోట్ల ఉన్నప్పటికీ, ఇక్కడ మినహాయించడానికి ఎటువంటి తార్కిక వాదము చేయలేము. దేవుడు ప్రత్యక్ష గుడారములో తన ప్రజలమధ్య నివసించాడు (నిర్గమ. 25:8; 29:42–46), కాని ఆ విషయము ఇక్కడ చర్చలో భాగము కాదు. ఈ వాక్యము "దేవునికి" "యాపెతును విశాలపరచమని" మరియు "షేము గుడారములలో ఉండుటకు ఆయనకు (యాపెతుకు) అనుమతినివ్వమని" చేసుకునే ఒక వేడుకోలు కంటే మరేమీ కాదు.

ఈ విన్నపము యొక్క సహజ అర్థము యాపెతు యొక్క ప్రాంతము మరియు తన పరపతి విశాలపరచబడి షేము యొక్క గుడారములలో లేదా వాటి మధ్యలో యాపెతు నివసింపనిమ్మని నోవహు దేవుని అడుగుతున్నట్లుగా ఉంది. ఇది న్యాయాధిపతుల కాలము మరియు సౌలు పరిపాలనా కాలంలో క్రేతు మరియు ఏజియన్ దీవులనుండి ఫిలిష్తీయులు వచ్చి అనేకమంది ఇశ్రాయేలీయులను దండెత్తి వశపరచుకున్నప్పుడు నెరవేరిందని కొంతమంది నమ్ముతారు. ఇంకొందరు క్రీ.పూ. రెండవ శతాబ్దములో పాలస్తీనాను ఏలిన Seleucid రాజైన Antiochus Epiphanes IV పరిపాలనా కాలమును సూచిస్తుందని నమ్ముతారు. అటువంటి నెరవేర్పు ఏదైనను శాపమే, ఎందుకంటే యాపెతు సంతానమువారు షేము గుడారములలో ఉండుటకు లేదా వాటిని ఆక్రమించుకొనుటకు బలవంతం చేయబడతారు.

దీనికి విరుద్ధంగా, ఈ వాక్యము "యాపెతు" సంతానమువారు "షేము గుడారములలో" "(సమాధానముతో) నివసించులాగున" నోవహు పలికిన ఆశీర్వాదములో భాగము. నూతన నిబంధన కాలము వరకు ఆయన ప్రవచనం చరిత్రలో సరిగా ఏ కాలంలో నెరవేరిందో కనుగొనడం కష్టం. అయితే, నోవహు దేవునికి చేసిన విన్నపము యొక్క అంతిమ నెరవేర్పు పౌలు యొక్క సువార్త దండయాత్రలతో ఆరంభమైనట్లుగా ఉంది; అవి సిరియాలోని అంతియొకయ నుండి తర్షీషు వరకు, గలతీయుల పట్టణముల వరకు, ఎఫెసు వరకు, ఏజియన్ సముద్రం మీదుగా గ్రీసు వరకు, ఇంకా మొదలగు స్థలముల వరకు ఆయన దండయాత్ర కొనసాగింది. ఈ ప్రదేశాలలో, యాపెతు యొక్క వంశస్థులు (అన్యజనులైన క్రైస్తవులు) షేము వంశస్థులతో (యూదా క్రైస్తవులు) కూడ సమాధానంతో ఒకే నివాసంలోనికి సమకూర్చబడ్డారు– అంటే క్రీస్తు యొక్క ఆత్మీయ శరీరంగా, సంఘముగా చేయబడ్డారు (ఎఫెసీ. 2:11–22).

9:27లోని ఆఖరు మాట **కనాను** కేవలము షేమునకు మాత్రమే కాక యాపెతునకు కూడా **సేవకునిగా** ఉండవలసి ఉందని చెప్తుంది. ఇక్కడ శాపాన్ని ఇంకా పునరుద్ఘాటిస్తూ మూడవ సారి కనాను యొక్క భవిషత్తులోని దాస్యము (బానిసత్వము) ప్రస్తావించబడింది. అప్పటికే, క్రీ.పూ. రెండవ సహస్రాబ్ది ఆరంభ కాలము (అబ్రాహాము కాలము) మొదలు, చాలా మంది కనానీయులు పాలాస్తీనాలో మాత్రమే కాక, కనాను దేశమునకు ఉత్తర భాగాన ఉన్న (ఆధునిక లెబానోను నుండి సిరియాలోని Ugarit వరకు) మధ్యధరా సముద్రపు తూర్పు కోస్తా భాగంలో కూడా నివసించేవారు.[24] ప్రాచీన ప్రతుల ప్రకారం, ఇశ్రాయేలు వాగ్దాన దేశమునకు ప్రవేశించిన సమయమునకు సమీపంలోనే, చాలా కాలంగా కనానీయులచే ఆక్రమించుకొనబడిన ప్రాంతాలలో ఏజియన్ దీవుల నుండి వచ్చిన సముద్రపు ప్రజలు (వీరిలో కొంతమంది యాపెతు వంశస్థులు) కొన్ని గూళ్లు తొలచుకొనుచుండెడివారు. యాపెతును గూర్చి నోవహు పలికిన ఆశీర్వాదము యొక్క నెరవేర్పులో భాగముగా అటువంటి సంఘటనలు జరిగి ఉండవచ్చు.

## నోవహు మరణము (9:28, 29)

**[28]ఆ జలప్రవాహము గతించిన తరువాత నోవహు మూడువందల ఏబది యేండ్లు బ్రదికెను. [29]నోవహు బ్రదికిన దినములన్నియు తొమ్మిదివందల ఏబది యేండ్లు; అప్పుడతడు మృతిబొందెను.**

నోవహు యొక్క చరిత్ర 5:3–32లో చెప్పబడిన షేతు యొక్క వంశావళిని ముగించుటకుగాను రెండు భాగముల సంస్మరణ సమాచారంతో ముగుస్తుంది.

**వచనం 28**. 5వ అధ్యాయమును చర్చించినప్పుడు, ప్రాచీన నివేదికలలో "10" అనే సంఖ్యకు గల ప్రాధాన్యతను మనం గుర్తించాం. ఆ పితరుల వివరములో నోవహు పదవ మరియు ఆఖరు స్థానాన్ని పొందాడు. **ఆ జలప్రవాహము గతించిన తరువాత నోవహు మూడువందల ఏబది యేండ్లు బ్రదికెను** అని ఇక్కడ లేఖన భాగం చెప్తుంది. కాబట్టి, జలప్రళయమునకు మునుపటి ప్రపంచమునకును ఆ తరువాత వచ్చిన జలప్రళయము తరువాత ప్రపంచమునకును ఆయన చాలా ప్రాముఖ్యమైన ఆధారంగా ఉన్నాడు.

5వ అధ్యాయంలో షేతు వంశస్థులను గూర్చి సాధారణంగా పలుకబడిన వ్యక్తీకరణ, "అతడు కుమారులను కుమార్తెలను కనెను" అనే మాట ఈ వివరణలో కనబడుటలేదు. ఈ విధంగా విడిచిపెట్టుట జలప్రళయము తరువాత మానవాళి అంతయు నోవహు ముగ్గురు కుమారులైన షేము, హాము మరియు యాపెతు నుండి వచ్చినవారే అని ముగింపుగా చెప్తుంది.

**వచనం 29**. ఈ పితరుని సంస్మరణ **నోవహు బ్రదికిన దినములన్నియు తొమ్మిదివందల ఏబది యేండ్లు; అప్పుడతడు మృతిబొందెను** అనే మాటలతో

ముగుస్తుంది. Utnapishtim అనే ఒక పురాణపు కథలో, బబులోను దేశపు నోవహు జలప్రళయము తరువాత దేవతలవలె మరణము లేనివానిగా చేయబడ్డాడు.[25] కాని నిజమైన నోవహు మాత్రం, హనోకు మినహా 5:3–32లో నమోదు చేయబడిన తన పితరులందరి వలె అదే అంతమును పొందాడు. అంటే, “అతడు మృతిపొందెను.”

## అన్వయము

### దేవుని కృపగల వరములు (9:1–20)

ఒక రకంగా, నోవహు రెండవ ఆదాము. జలప్రళయము మునుపటి జనాభాచే జరుపబడిన చెడుతనము నుండి పవిత్రపరచబడిన ఒక నూతన ప్రపంచంలోనికి అతడు మరియు అతని కుటుంబము అడుగు పెట్టారు. దేవుడు తన కృపలో మానవాళికి ఒక నూతన ఆరంభాన్ని ఇస్తున్నాడు. ఆదాము మరియు హవ్వలు చేసిన పాపమును బట్టి ఆయన మానవాళిపై పలికిన శాపాన్ని తిరిగి వెనక్కి తీసుకోవడం లేదు, కాని సృష్టిలో ఆయన చేసిన కొన్ని మూల ఆశీర్వాదాలను మరలా పునరుద్ఘాటిస్తున్నాడు. నూతన మానవాళిని ఆరంభించిన పితరులకు ఇంకొన్ని ఆశీర్వాదాలను ఆయన ఇచ్చాడు.

*1వ ఏర్పాటు: మానవ కుటుంబాల* వృద్ధి (9:1, 7). సృష్టిలో ఇవ్వబడిన మొట్టమొదటి ఆజ్ఞ మరియు ఆశీర్వాదము (1:28) నోవహు కుటుంబము కొరకు రెండుసార్లు పునరుద్ఘాటించబడింది, అది జలప్రళయము నుండి బ్రతికిన వారిని “ఫలించి, విస్తరించి భూమిని నింపమని” (9:1,7) ప్రోత్సాహించింది. వివాహమనే ఆ కట్టడ దేవునిచే ఒక పవిత్రమైన వ్యవస్థగా పునఃప్రతిష్టించబడింది (2:22–25; మత్తయి 19:4–6 చూడండి), ఇది రెండు లింగాలకు మధ్యనున్న సంబంధాన్ని అవమానకరమైన సాంగత్యాలకంటే ఉన్నతంగా నిలుపుతూ సమాజంలో స్థిరత్వాన్ని పెంపొందిస్తుంది. శరీర సంబంధమైన స్వభావాల వలన మానవుని ఆపుకోలేని కోరికలు మరియు నిగ్రహములేని సంతృప్తులు నుండి లేవనెత్తుటకు ఇది దేవుని ప్రయత్నం. ఈ వ్యవస్థను బహుభార్యత్వం మరియు తప్పుడు కారణాలకు వివాహం చేసుకొనుట అనువాటిచే భ్రష్టుపట్టించుట వలననే చాలామట్టుకు ప్రపంచంలోని దుర్నీతి వచ్చింది.

ఆదాము మరియు హవ్వల సంతానములో అధిక శాతం ఈ భూమిని నింపిన విపరీత పాపంలో పాలుపొందినవారే. అయినప్పటికీ, షేతు యొక్క నీతిగల వంశం నిజమైన దేవుని గూర్చిన జ్ఞానాన్ని కాపాడి తరువాత తరములవారికి అందించింది. ఈ ప్రక్రియ నోవహులో ముగింపునకు వచ్చింది. పాపము చేయుటకు మానవునికి గల ప్రవృత్తికి బదులు, నోవహు సంతానము ద్వారా మానవాళికి

అంతిమ విమోచన సంప్రాప్తించుటకు దేవుడు అల్పులైన మానవుల ద్వారా తన కృపలో క్రియ జరిగించుటకు ఇంకా ఇష్టపడుతూనే ఉన్నాడు: షేము (10:21–31) అబ్రామునకు (లేదా అబ్రాహాము 11:10–26) పితరుడు మరియు ఇతని అంతిమ సంతానముగా యేసుక్రీస్తుగా ఉండవలసియుంది (మత్తయి 1:1–17; గలతీ. 3:8–29).

లేఖనములలో పిల్లలు దేవునియొద్ద నుండి వచ్చిన బహుమానముగా పరిగణించబడ్డారు. అనేకమంది పిల్లలు మరియు మనుమలు మనుమరాండ్రను కలిగి ఉండడం దైవిక అనుగ్రహం వలె చూడబడింది (24:60; కీర్తనలు 127:3–5; 128:3, 4). విచారం ఏమంటే, ఈ నాడు చాలా మంది తమ పిల్లలను ఈ విధంగా పరిగణించరు, దీనిని మనం అనేక దేశాలలో ఉన్న గర్భవిచ్ఛిత్తి నిష్పత్తి వలన తెలుసుకొనగలం. పరిశుద్ధ గ్రంథకాలంలో, ఒక బిడ్డను గర్భంలో చంపడం చేసేవారు కారు. జీవము దేవుని వరమనియు, మరియు పిల్లలు ప్రేమించబడుటకు, సంరక్షించబడుటకు మరియు దేవుని మహిమ కొరకు పెంచబడుటకు ప్రభువిచ్చిన ఒక ఆశీర్వాదముగా వారిని పరిగణించేవారు.

*2వ ఏర్పాటు: మానవుని జీవితము యొక్క పోషణ* (9:2–4, 20). జలప్రళయమునకు ముందు మానవులు జంతువుల మాంసమును తిన్నారా లేదా అనే విషయంపై పరిశుద్ధ గ్రంథము మౌనంగా ఉంది. కాని, మానవుని పతనము తరువాత, తోటి మానవుని రక్తమును చిందించు విషయంలో చాలా మంది పట్టనట్టుగా ఉన్నారు అని మాత్రం మనకు తెలుస్తుంది (4:8, 14, 23, 24; 6:11); మరియు ఆహారం నిమిత్తం జంతువులను చంపుటకు వారు వెనుకాడేవారు అనేది సందేహాత్మకం. ఈ రెండవ విషయాన్ని దేవుడు అనుమతించి ఉండవచ్చు, కాని ఈ ప్రయోగము యొక్క మొట్టమొదటి పాజిటివ్ అనుమతి నోవహు మరియు తన కుటుంబము ఓడను విడిచిన తరువాత వచ్చింది. నూతన ప్రపంచంలో నాటుటకుగాను నోవహు ఆ ఓడలోనికి తీసుకొచ్చిన విత్తనములతో (9:20) కలిపి, ప్రతి భూజంతువును, ఆకాశ పక్షిని, నేలమీద ప్రాకు ప్రతిజీవిని, సముద్రపు చేపలన్నిటిని (9:3) తినుటకు దేవుడు మానవాళికి ఏర్పాటు చేశాడు.

ఈ జీవులన్నియు మానవునికి భయపడులాగున కూడా దేవుడు చేశాడు (9:2). మనుష్యుని ముందు నుండి అవి తమంతట తాము పారిపోయి అధికంగా వేటాడుట వలన అంతరించిపోయే ప్రమాదం నుండి కాపాడబడులాగున దేవుడు ఈ మార్పును చేసి ఉంటాడు. భౌతికంగా మానవులు మరియు జంతువులు బ్రతకాలంటే, తాము ఇతర ప్రాణులపై, అది జంతువులు గాని మొక్కలు గాని, ఆధారపడి బ్రతకవలసి యుంటుంది. ఈ కారణము చేత దేవుడు మానవునికి భూలోకమంతటిపై ఆధిపత్యాన్ని ఇచ్చాడు. మానవునిపై కొంత పరిమితులను కూడా ఉంచాడు: ఆహారము కొరకు జంతువుల మాంసమును వారు తినుటకు అనుమతించబడినప్పటికి, మాంసముతో వాటి రక్తమును మాత్రము వారు

తినకూడదు (9:4). ఇక్కడ మోషేకు తరువాత కాలంలో వివరంగా దేవుడు ఏమి చెప్పాడో అదే విషయాన్ని నోవహుకు క్లుప్తంగా చెప్పాడు: రక్తములో జీవము ఉంది, ఇది దేవుని యొద్ద నుండి వస్తుంది గనుక ఈ జీవము యొక్క మూలం గౌరవించబడాలి (లేవీ. 3:17; 7:26, 27; 17:10–14; ద్వితీ. 12:16, 23–25; 15:23).

తమ అవసరతలు మరియు కోరికలకు మధ్యగల వ్యత్యాసాన్ని చూడడంలో మానవుడు ఎప్పుడు ఇబ్బంది పడుతుంటాడు. ఏదైనా ఒక ఆకర్షణీయమైనదానిని మనం చూసినప్పుడు, దానిని మనం ఆశిస్తూ ఉంటాం; ఆ ఆశ నిగ్రహించబడకపోతే, ఆశించిన ఆ వస్తువు లేకుండా మనం జీవించలేమేమో అనుకుని దానిని ఒక "అవసరత"గా ఆలోచిస్తాం. దేవుడు ఆదాము మరియు హవ్వలను ఏదెను తోటలో ఉంచిన నాటనుండే, ఆది నుండే మానవాళి యొక్క బలహీనత ఇది. వారికి కావాల్సిన ప్రతిదీ ఆయన సమకూర్చాడు. తినుటకు వారికి సమస్త విధములైన ఫలములు మరియు మొక్కలు ఉన్నాయి. వారు పాపము చేసిన తరువాత, జంతువుల చర్మములతో కూడా వారిని కప్పాడు (1:29; 2:9, 16; 3:21). యేసు కొండమీద చేసిన ప్రసంగంలో ఏమి తిందుమా, ఏమి త్రాగుదుమా, ఏమి ధరించుకొందుమా అని చింతించుచున్న వారిని గూర్చి మాట్లాడిన విధంగానే ఆహారము మరియు వస్త్రము అనునవి మానవుని రెండు ప్రాముఖ్యమైన అవసరతలు. యేసు మాట్లాడుతూ మన పరలోకపు తండ్రి పూలను అందముతో అలంకరించి ఆకాశ పక్షులకు ఆహారము సమకూర్చినపుడు, తన సొంత ప్రియమైన బిడ్డలకు ఆయన ఆహారము మరియు వస్త్రము తప్పక దయచేస్తాడు అని అన్నాడు. ఇవి మనకు అవసరమైయున్నవని దేవునికి తెలుసు (మత్తయి 6:25–32).

ఈ విషయంతో అపొస్తలుడైన పౌలు ఏకీభవించాడు. ఇలాగే ఆయన కూడా మానవుని ప్రాథమిక అవసరతలను రెండు విషయాలకు కుదించాడు, "కాగా అన్నవస్త్రములు గలవారమై యుండి వాటితో తృప్తిపొందియుందము" అని పలికాడు (1 తిమోతి 6:8). దీనికి అర్థం కనీస అవసరతలకన్నా ఎక్కువ కలిగి ఉండడం తప్పు అని కాదు, కాని ఆస్తులను ప్రేమించి అత్యాశను అవసరతగా భావించకుండా ఇది ఒక హెచ్చరిక మాత్రమే. ఈ ఉచ్చులో పడే ప్రజలు తమ స్వార్థపూరిత ఆశలను నెరవేర్చుకోడానికి ఎక్కువ భౌతిక సామగ్రిని కొని ఎక్కువ ఆస్తులను సంపాదించుకొనుటకు తమ జీవితాలను గడుపుతూంటారు. "అవివేకయుక్తములైన హానికరములైన అనేక దురాశలలోను పడవేసే" వాటి గురించి హెచ్చరించినప్పుడు పౌలు, "ఎందుకనగా ధనాపేక్ష సమస్తమైన కీడులకు మూలము; కొందరు దానిని ఆశించి విశ్వాసమునుండి తొలగిపోయి నానాబాధలతో తమ్మును తామే పొడుచుకొనిరి" అని అన్నాడు (1 తిమోతి 6:9b, 10).

*3వ ఏర్పాటు: మానవ కుటుంబము యొక్క సంరక్షణ* (9:5, 6). ఆహారము

కొరకు జంతువులను చంపుట అను అంగీకారయోగ్యమైన ఆచారము మరియు వాటి రక్తమును తినుట అనే నిషిద్ధమైన ఆచారమును గూర్చి దేవుడు నోవహుకు హెచ్చరికలు చేసిన తరువాత, ఇంకా మిక్కిలి ముఖ్యమైన అంశము వైపు తిరిగాడు: మానవుని రక్తమును చిందించుట. మానవుని చూసి భయపడే జంతువుల మరియు మానవుని ఆహారముగా భావించే పిరికిగా ఉండే మరియు/లేదా శత్రుభావంతో ఉండే జంతువుల నుండి దేవుడు మానవునికి భద్రతను ఇచ్చాడు. మానవుని రక్తమును చిందించినందుకు మానవుడు మరియు జంతువులు కూడా బాధ్యత వహించవలసి ఉన్నదని చెప్పాడు. అతిక్రమించినవారు తమ సొంత ప్రాణరక్తమునే (అక్షరాలా, "మీకు ప్రాణమైన మీ రక్తమును, 9:5) పోగొట్టుకోవాలి అని పలికాడు.

మానవునికంటే భౌతికంగా పెద్దవిగా ఉండే జంతువులు మానవుని జీవమునకు గొప్ప ప్రమాదాన్ని కలిగించవచ్చు, కాని అవి విచక్షణారహితంగా చంపబడకూడదు. మానవాళిపై విరుచుకుపడే జంతువులు ప్రజలను కాపాడులాగున నాశనం చేయబడాలని దేవుడు చెప్పాడు. జీవులన్నియు పవిత్రమైనవే; కాని మానవుని జీవము దేవునికి ప్రత్యేకంగా పవిత్రమైనది కనుక, ఆలోచనా శక్తి ఉన్న మానవులనుండి మాత్రమే కాక, మానవులపై కిరాతకంగా దాడిచేసే బుద్ధిలేని జంతువులనుండి కూడా వారి హక్కులు కాపాడబడాలి.

జలప్రళయము తరువాత మానవాళిని కాపాడుటకు మొదటిగా దేవుడు జంతువులలో మానవుని గూర్చిన భయమును పెట్టాడు. ఆ పిమ్మట మానవులు జలప్రళయమునకు మునుపు ఒకరినొకరు చంపుకున్నట్లుగా (6:11–13) మరలా చంపుకొనకుండా వారిలో దేవుని గూర్చిన భయాన్ని దేవుడు పెట్టాడు. ఇప్పటివలె అప్పుడు కూడా నరహంతకులు తమ సృష్టికర్తకు జవాబుదారులని తెలుసుకొనవలసి ఉన్నది. తోటి మానవునిపై దాడి చేయడమంటే, ఒక విధంగా, దేవుని పైనే దాడి చేయడం. ప్రతి జీవి దేవుడిచ్చిన వరముగా భావించాలి. మానవుని జీవాన్ని నాశనం చేయడమంటే దేవుని స్థానాన్ని తీసుకుని ఆయన పోలికలో చేయబడిన ఒకని నాశనం చేయడమే (9:6). జీవము ఇవ్వగలవాడు కేవలము దేవుడు మాత్రమే గనుక, దానిని తిరిగి తీసుకొనుటకు అధికారము ఇవ్వవలసిన వాడు కూడా ఆయనే (యోబు 1:21).

మనకు తెలిసినంతవరకు, జలప్రళయానికి ముందు దేవుడు నరహంతకుల యొక్క మరణశిక్షను అధీకృతం చేయలేదు; అయినను ఆదినుండే అది ప్రయోగించబడినట్లుగా ఉంది, ఒకపేళ సదరు బాధితుని బంధువు ద్వారా కావచ్చు. తన సహోదరుడైన హేబెలు హత్యకు ప్రతిగా ఎవరైనా తనను చంపుతారేమో అని కయీను భయపడ్డాడు (4:14). బహుశా, జలప్రళయము మునుపటి ప్రపంచంలో ఒక నిర్దిష్టమైన మరియు స్థాపితమైన న్యాయ వ్యవస్థ లేదు. అతను ఒక పడచువానిని చంపిన విషయం లెమెకు కనీసం దాచడానికి

కూడా ప్రయత్నించలేదు. నిజానికి ఆ హత్యను గూర్చి అతను తన భార్యలవద్ద గొప్పలు చెప్పుకున్నాడు (4:23, 24). మానవుని హస్తాల నుండి ఏదైనా తీర్పు లేదా శిక్ష పొందుతానేమో అనే భయం పూర్తిగా లేనట్లుగా కనబడుతున్నాడు.

సమయము గడచిన కొలదీ, జలప్రళయము ముందు హత్య మరియు హింస విచ్చలవిడిగా ఉన్నప్పుడు, వారి నేరములను బట్టి దోషులుగా తీర్చడానికి ఏ వ్యక్తిగాని లేదా ఏ ప్రభుత్వపు సంస్థగాని లేదు. శిక్షను ఎదుర్కొనుటకు బదులు, వారు పేరు[26] సంపాదించుకుని ఆ సమాజములో గొప్ప వ్యక్తులు అయ్యారు (6:4). తనకున్న అంతిమ అధికారాన్ని ఒక్కసారే అందరికి చూపించుటకు దేవుడు జలప్రళయము ద్వారా ఆ పాత ప్రపంచము మీదికి మరణ శిక్ష రప్పించాడు, కాని కేవలం నోవహు మరియు తన కుటుంబాన్ని మాత్రమే రక్షించాడు.

జలప్రళయము తరువాత మానవుని జీవితాన్ని కాపాడుటకు హంతకులతో ప్రవర్తించవలసిన విధానం గురించి దేవుడు నోవహుకు కొన్ని సూచనలు ఇచ్చాడు: "నరుని రక్తమును చిందించువాని రక్తము నరుని వలననే చిందింపబడును; ఏలయనగా దేవుడు తన స్వరూపమందు నరుని చేసెను" (9:6). దేవుని స్వరూపములో చేయబడిన ఒక వ్యక్తిని ఇష్టపూర్వకంగా మరియు విచక్షణారహితంగా చంపడం అంటే అట్టి హంతకుని జరిమానాగా తన సొంత ప్రాణాన్ని వదలడమే. ఎవరైనా ఒకరి చేత– తరువాత నిర్మితమైన వ్యవస్థ చేత– హంతకుని చంపుటకు అధీకృతం చేయబడాలి. అతి ప్రాచీన రూపంలో ఉన్న ప్రజా ప్రభుత్వము యొక్క ఆరంభం ఇదే. ఈ విధంగా, ఒక హంతకుని చంపే ఉన్నతమైన అధికారాన్ని దేవుడు మానవునితో పంచుకున్నాడు. రోమా. 13:1–7లో పౌలు చెప్పినట్లుగా మానవ ప్రభుత్వము మరియు మరణ శిక్ష ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. చెడుతనము చేయువారిని దండించుటకు ప్రభుత్వపు అధికారులు దేవునిచే యేర్పరచబడ్డారు, ఎందుకంటే "వారు ఊరకయే ఖడ్గము ధరింపరు."[27] మానవ ప్రభుత్వమునకు తప్పనిసరిగా బలహీనతలు కూడా ఉంటాయి. కొన్నిసార్లు పాలకులు తమ అధికారాన్ని దుర్వినియోగపరుస్తారు, ఇంకా చేయని నేరము చేసారని అమయాకులైన ప్రజలు కొన్నిసార్లు తీర్పు తీర్చబడవచ్చు. మనుష్యులు తమకు మంచిదనిపించిన దానిని చేసే అస్థిరత (ప్రభుత్వలేమి) కంటే తప్పిదములు చేసే ప్రభుత్వము మెరుగైనది (న్యాయాధి. 17:6; 18:1; 19:1; 21:25).

*4వ ఏర్పాటు: భూమిపై జీవమును కాపాడుటకు ఒక నిబంధన* (9:15–17). జలప్రళయము తరువాత దేవుడు మానవునితో చేసిన నిబంధన తరచుగా "నోవహు నిబంధన"గా పిలువబడేది, కాని అది కేవలం నోవహు మరియు ఆయన కుటుంబముతో మాత్రమే చేసిన నిబంధన కాదు. అది తన "సంతానము" (9:9) అంతటితో మరియు భవిష్యత్తులో రాబోయే "తరతరములకు" (9:12) చేసాడు. ఆ నిబంధన అంతటితో కూడా ఆగలేదు; అది ప్రతివిధములైన "సమస్త జీవరాశి"ని

కూడా కలిగి ఉంది (9:10, 12, 15). మానవులు, పక్షులు, జంతువులు, మరియు ప్రాకే ప్రతి జీవియు దేవుని వాగ్దానమునకు లబ్ధిదారులు. జలప్రళయము నుండి కాపాడబడిన వారందరికీ, కాలము యొక్క అంతము వరకు కొనసాగే షరతుల్లేని వాగ్దానమును దేవుడు చేసాడు: భూమి మీద నివశించు జీవులను నాశనము చేయుటకు ఇకను జలప్రవాహము దేవుడు కలుగజేయడు. ఆకాశములో భయానకమైన మేఘాలు ప్రత్యక్షమైన ప్రతిసారి మానవుడు నిరాశ చెందకుండా మానువుని ఈ వాగ్దానము కాపాడింది.

సాధారణంగా, ప్రాచీన ప్రపంచంలో నిబంధనలు చేయబడినప్పుడు, ఇరు పక్షాల మీద కొన్ని ఒడంబడిక షరతులు ఉంచేవారు. అయినను, దేవుడు ఆ నిబంధన యొక్క మనుగడను గూర్చి మానవులపై ఎట్టి షరతులు ఉంచకుండా దేవుడే స్వయంగా తనమీదనే ఆ నిబంధనను ఉంచుకున్నాడు. మానవులకు ఇచ్చిన ఈ "నిత్య నిబంధన"ను (9:16) ఆయన నిలబెట్టుకుంటానని హామీగా దేవుడు మానవులు చూడగలిగే ధనుస్సును "గురుతు"గా ఇచ్చాడు (9:12–17). మేఘములో దేవుడు ఉంచిన ధనుస్సు ఈ పాపపూరితమైన ప్రపంచంపై దేవుని తీర్పును వెంబడించిన దేవుని కృపకు గురుతుగా ఉంది; ప్రపంచవ్యాప్త జలప్రళయముతో దేవుడు మరలా ఈ భూమిపైనున్న సమస్త జీవులను నాశనం చేయడని భవిష్యత్తు తరములవారికి అది ఒక నిరీక్షణ ఇచ్చింది.

ప్రజలందరూ పాపము చేస్తారనేది వాస్తవమైనను (రోమా. 3:23), దేవుడు తన సృష్టిని దీవించి మనపై మంచి వరములను కుమ్మరించాలని ఇంకా ఆశిస్తున్నాడు (మత్తయి 5:45; 7:11). మనలను ప్రేమించే, పట్టించుకునే, కాపాడే, మరియు పోషించే వానికి మనమిచ్చే ఒకే సరియైన స్పందన ఆయనను కూడా ప్రేమించి ఆయనకు విధేయులమై యుండటమే.

## ధనుస్సులోని పునఃనిశ్చయత (9:12 –17)

దేవుని ప్రజలు గొప్ప ఉపద్రవములో ఉండి కొందరు తమ విశ్వాసమును విడిచిపెట్టే అంచులో ఉన్నప్పుడు, ధనుస్సు అనే గురుతు ద్వారా దేవుడు రెండుసార్లు తనను తాను ప్రత్యక్షపరచుకున్నాడు. బాధపడుచున్న తన ప్రజలు ఆయన తన సింహాసనమందు ఆశీనుడై ఆకాశమునకును భూమికిని సర్వశక్తిగల దేవుడైయున్నాడనియు, సమయములన్నియు ఆయన ఆధీనంలో ఉన్నవనియు వారు తెలుసుకోవాలని అనుకుంటున్నాడు.

*యెహోవా మహిమ: యెహెజ్కేలు గ్రంథంలో ధనుస్సు.* ధనుస్సును సూచకంగా ప్రయోగించిన ఉదాహరణలలో మొదటిది బబులోను చెర రెండవ దశలో, అంటే సుమారుగా క్రీ.పూ. 598లో, యెహెజ్కేలు, రాజైన యెహోయాకీను మరియు తన కుటుంబము ఇంకా పదివేలమంది యెరుషలేము పౌరులతో బందీలుగా బబులోనునకు కొనిపోబడినప్పుడు (2 రాజులు 24:8–17)

ప్రయోగించబడింది. ఐదు సంవత్సరాల తరువాత (సుమారు క్రీ.పూ. 593లో) దేవుడు యెహెజ్కేలును ప్రవక్తగా పరిచర్యకు పిలిచాడు. ఖేబారు నది ఒడ్డున ఆయనతో కూడా ఉన్న బందీలకు యెహెజ్కేలు యూదా ప్రజలు తమ విగ్రహారాధనను మరియు చేడుతనమును విడిచి పశ్చాత్తాపము పొందకపోతే యెరూషలేము మరియు దేవాలయము నాశనం చేయబడతాయని హెచ్చరించవలసియుంది. చెరగొన్న వారి మధ్యలో ఆయన అనుభవించిన తన మొదటి దర్శనమును రాస్తూ ప్రవక్త అంటాడు,

> ... ఆ కాలమున ఆకాశము తెరవ బడగా దేవునిగూర్చిన దర్శనములు నాకు కలిగెను ...
>
> నేను చూడగా ఉత్తర దిక్కునుండి తుఫాను వచ్చుచుండెను; మరియు గొప్ప మేఘమును గోళమువలె గుండ్రముగా ఉన్న అగ్నియు కనబడెను, కాంతి దానిచుట్టు ఆవరించియుండెను; ఆ అగ్నిలోనుండి కరగబడినదై ప్రజ్వలించుచున్న యపరంజివంటి దొకటి కనబ డెను. దానిలోనుండి నాలుగు జీవుల రూపములుగల యొకటి కనబడెను, వాటి రూపము మానవ స్వరూపము వంటిది ...
>
> ఈ జీవులను నేను చూచుచుండగా నేల మీద ఆ నాలుగింటి యెదుట ముఖముల ప్రక్కను చక్రమువంటిదొకటి కనబడెను ...
>
> మరియు జీవుల తలలపైన ఆకాశమండలము వంటి విశాలతయున్నట్టుండెను. అది తళతళలాడు స్ఫటికముతో సమానమై వాటి తలలకు పైగా వ్యాపించి యుండెను. ఆ మండలమువంటి దాని క్రింద జీవుల రెక్కలలో రెండేసి యొకదానిప్రక్క ఒకటి పైకి చాపబడియుండెను; రెండేసి వాటి దేహములు కప్పుచుండెను, ఈ తట్టుననున్న జీవులకును ఆ తట్టుననున్న జీవులకును, అనగా ప్రతిజీవికిని ఆలాగున రెక్కలుండెను. అవి జరుగగా నేను వాటి రెక్కల చప్పుడు వింటిని; అది విస్తారమైన ఉదకముల ఘోషవలెను సర్వశక్తుడగు దేవుని స్వరమువలెను దండువారు చేయు ధ్వనివలెను ఉండెను, అవి నిలుచునప్పుడెల్ల తమ రెక్కలను వాల్చుకొనుచుండెను. అవి నిలిచి రెక్కలను వాల్చునప్పుడు వాటి తలలకు పైగానున్న ఆకాశ మండలమువంటి దానిలోనుండి శబ్దము పుట్టెను.
>
> వాటి తలల పైనున్న ఆ మండలముపైన నీల కాంతమయమైన సింహాసనమువంటి దొకటి కనబడెను; మరియు ఆ సింహాసనమువంటి దానిమీద నరస్వరూపియగు ఒకడు ఆసీనుడైయుండెను. చుట్టు దాని లోపట కరుగుచున్న యిత్తడియు అగ్నియు నున్నట్టు నాకు కనబడెను. నడుము మొదలుకొని మీదికిని నడుము మొదలుకొని దిగువకును ఆయన అగ్నిస్వరూపముగా నాకు కనబడెను, చుట్టును తేజోమయముగా కనబడెను. *వర్ష కాలమున కనబడు ఇంద్రధనుస్సు యొక్క తేజస్సువలె దాని చుట్టునున్న తేజస్సు కనబడెను*. ఇది యెహోవా ప్రభావ స్వరూప దర్శనము. నేను చూచి సాగిలపడగా నాతో మాటలాడు ఒకని స్వరము నాకు వినబడెను (యెహెజ్కేలు

1:1–28; ఉద్ఘాటన చేర్చబడినది).

యెరూషలేములో ఉండిపోయిన ఇశ్రాయేలీయులు ఆత్మీయ భ్రమలో ఉన్నవారు; వారు దేవాలయమును ఇతర దేవీదేవతలకు చేసిన విగ్రహములు మరియు బలిపీఠంతో నింపినను, అది యెహోవా యొక్క నివాస స్థలమని వారు ఇంకను నమ్ముతూనే ఉన్నారు. దేవుడు తన దేవాలయమును లేదా యూదా రాజ్యమును నాశనమునకు అప్పగిస్తాడని వారు నమ్మలేదు.

తమను తాము మోసగించుకొన్న దానికి తోడు, యెరూషలేములో ఇంకను ఉన్న ప్రజలు 605 నుండి 598 మధ్య బబులోనుకు చెరగొనబడిన తమ తోటి దేశస్థులను చూసి హేళన చేసేవారు. చెరలో ఉన్నవారు వాగ్దాన దేశంలో లేరు గనుక (యెహెజ్కేలు 11:15) వారు యెహోవాకు దూరస్తులుగా ఉన్నారని వారు అనేవారు.

యెహెజ్కేలు పుస్తకములోని ప్రారంభ దర్శనము వారి ఆలోచన తప్పు అని బయలుపరచింది. చెరలోనున్న తన ప్రజలకు దేవుడు ప్రవక్తల ద్వారా ఆదరణ మాటలను అందించే సమయంలో, దేవాలయములో ఉన్న నిబంధన మందసముపై గల సెరాపుల మధ్య ఆయన ఆసీనుడై లేడు (2 సమూ. 6:2 చూడండి). మిగుల సూచనప్రాయమైన లేఖన భాగంలో, యెహోవా ఈ విశ్వమంతటికి గొప్ప రాజుగా, జీవులచే నడపబడే చక్రములు కలిగిన పరలోకపు సింహాసనా రథంపై స్వారీ చేసిన వానిగా, ఈ జీవులే తరువాత సెరాపులుగా గుర్తించబడ్డాయి (యెహెజ్కేలు 1:15–26; 10:15, 20). ఇంకా అనేక దర్శనములు ప్రవక్తకు బయలపరచబడ్డాయి, వాటి ద్వారా ప్రవక్త రగులుచున్న ప్రజల చెడుతనము మరియు విగ్రహారాధనలను బట్టి "యెహోవా మహిమ" (ఆయన సన్నిధి) దేవాలయము నుండి మరియు యెరూషలేము పట్టణము నుండి వదలి వెళ్లిపోతున్నదని మిక్కిలి స్పష్టపరచాడు (యెహెజ్కేలు 8:3–6; 9:3–7; 10:1–5, 15–20; 11:22–25).

"యెహోవా మహిమ" పట్టణమును విడచి, యెరూషలేమునకు తూర్పున సుమారుగా ఒక మైలు దూరంలో ఉన్న ఒలీవ కొండమీద ఉండుటకు ఆగక మునుపు, దూర దేశములో కూడా ఖేబారు నది ఒడ్డున చెరలోని వారికి యెహోవాయే వారికి ఆత్మీయ "ఆలయము"గా ఉండునని బయలుపరచాడు (מִקְדָּשׁ, *miqdash*; "దేవాలయము"; యెహెజ్కేలు 11:16). మరొక మాటలో, యెరూషలేములో ఉన్న గర్విష్టులైన యూదులు తలంచినట్లుగా బబులోను చెరలో ఉన్న దేవుని ప్రజలు దేవునికి దూరంగా, విడువబడి ఎడబాయబడి లేరు. కాని, "యెహోవా మహిమ" యెరూషలేమును విడిచి వెళ్ళింది.

తన ప్రజలు పశ్చాత్తాపపడి, తమ హృదయములు మరియు జీవితాలను ఆయనవైపు మరల్చుకోవాలని దేవుడు ఆశించాడు. ఆయన వారిని ఇంకను

ఆశీర్వదించి క్షమిస్తున్నాడనియు, ఒక దినమున ఆయన వారిని తమ గృహాలకు చేరుస్తాడనియు వారు తెలుసుకొనవలసి ఉంది (యెహెజ్కేలు 11:17–20). వారిలో అనేకమంది నిరుత్సాహపడుతున్నారని దేవుడు అర్థం చేసుకున్నాడు, కాబట్టి వారికి భవిష్యత్తును గురించి నూతన నిరీక్షణను ఇవ్వాలని తలంచాడు. యెహెజ్కేలు యొక్క మొదటి దర్శనము రాబోయే సంగతులను గూర్చిన ఒక పూర్వగామిగా ఉంది.

కదులుచున్న సింహాసనపు రథము, "యెహోవా మహిమ," మరియు మెరుపు తీగలు (యెహెజ్కేలు 1:4, 13, 14) వీటన్నిటి ప్రత్యక్షత దేవుని యొద్ద నుండి తీర్పును గూర్చిన సందేశముగా పరిగణించవచ్చు; కాని ఇది నిరాశాపరులైన ఇశ్రాయేలీయులను ఖచ్చితంగా నిరాశపరచేదే. అయినను, దేవుని మహిమను గూర్చిన దర్శనము యొక్క ఆఖరులో, ఆయన చుట్టూ ఉన్న మహత్తరమైన తేజస్సును ప్రవక్త చూశాడు (యెహెజ్కేలు 1:27). ఇది చాలా భయానకమైన దృశ్యమై ఉండియుండగా, యెహెజ్కేలు చుట్టూ ఉన్న తేజస్సును చూసి చెప్పాడు, "వర్ష కాలమున కనబడు ఇంద్రధనుస్సు యొక్క తేజస్సువలె దాని చుట్టునున్న తేజస్సు కనబడెను ..." (యెహెజ్కేలు 1:28). ఆ అగ్నివంటి తేజస్సు తన ప్రజల పాపముపై రగిలిన కోపము కంటే ఎక్కువే; అది ఇంద్రధనుస్సుతో చుట్టుముట్టబడి ఉందనే వాస్తవం తీర్పునకు మధ్యలో కూడా దేవునికి కరుణ మరియు కృప ఉన్నాయనడానికి ఋజువు. దేవుని వద్దనుండి వచ్చిన ఈ సుందరమైన సందేశం, జలప్రళయము తరువాత నోవహు మరియు అతని కుటుంబ సభ్యులకు దేవుడు ఇచ్చిన ధనుస్సు వలెనే, చెరగొన్న వారికి నిరీక్షణను ఇచ్చింది.

*దేవుని సింహాసనము యొక్క మహిమ: ప్రకటన గ్రంథంలో ధనుస్సు.* పరిశుద్ధ గ్రంథ చరిత్రలో ధనుస్సు అనే ఈ గురుతు కనపడే మరియొక పర్యాయం యెహెజ్కేలుకు వందల సంవత్సరాల తరువాత, రోమా సామ్రాజ్యములోని క్రైస్తవులు భయంకరమైన శ్రమలను అనుభవిస్తున్నపుడు కనబడుతుంది. రోమా "వేశ్యలకును భూమిలోని ఏహ్యమైనవాటికిని తల్లియైన మహా బబులోను"గా అయింది. ఈ రాజధాని పట్టణము "పరిశుద్ధుల రక్తముచేతను, యేసుయొక్క హతసాక్షుల రక్తముచేతను" నిండుకొనిన వేశ్యతో పోల్చబడింది (ప్రకటన 17:5, 6). క్రీ.శ. మొదటి శతాబ్దపు ముగింపులో దేవుని పిల్లలకు ఇది చాలా కష్టతరమైన కాలము. సాతాను మరియు వాని ఆయుధములు[28] సంఘమును నాశనం చేయుటలో సఫలమౌతాయేమో అన్నట్లుగా ఉంది. రోమా యొక్క సాంఘీక, రాజకీయ మరియు సైన్య బలము క్రింద క్రైస్తవులు నిస్సహాయులుగా ఉన్నారు.

ఇటువంటి విపత్కర కాలంలో, అపొస్తలుడైన యోహాను చూచుటకు ప్రభువు తనకు అనుమతించిన దర్శనములను (ప్రకటన 1:11) గూర్చి రోమా సామ్రాజ్యపు ఆసియాలోని (నేటి టర్కీ దేశం) ఏడు సంఘములకు ఉత్తరములు

వ్రాయవలసినదిగా ఆజ్ఞాపించబడ్డాడు. ఈ దర్శనములను గూర్చిన ఆయన నివేదిక, ప్రకటన గ్రంథము, యేసుక్రీస్తును "మనలను ప్రేమించుచు తన రక్తమువలన మన పాపమునుండి మనలను విడిపించిన" వానిగా పరిచయం చేస్తూ ప్రారంభమయింది (ప్రకటన 1:5).

ప్రకటన 1:13–18లో యేసును దైవికమైన మనుష్యకుమారునిగా వివరించడం యెహెజ్కేలు 1 మరియు దానియేలు 7వ అధ్యాయములలో ఉన్న దృష్టాంతములలో నుండి తీసుకొనబడిన సింబాలిక్ భాషతో మిళితమై ఉంది. నిరీక్షణతో కూడుకున్న ఈ సన్నివేశము యేసును "మరణించిన"వానిగా, మరియు ఆయన "యుగయుగములు సజీవుడై" ఉండేవాడిగా సంబోధిస్తుంది. "మరణము యొక్కయు పాతాళ లోకము యొక్కయు తాళపుచెవులు" తన అధీనంలో ఉంచుకొనిన (ప్రకటన 1:18) విశ్వము యొక్క శాశ్వత న్యాయాధిపతియైన తిరిగిలేచిన ప్రభువును దేవునిగా చిత్రీకరించే ఈ ఆరంభ దర్శనం చాలా భయానకమైన మరియు మహత్తరమైన దృశ్యం.

సంఘములకు వ్రాయబడిన పత్రికలు అభినందన మరియు హెచ్చరిక, ఆశీర్వాదం మరియు ప్రోత్సాహకాలను కలిగి ఉన్నాయి. "అంతము వరకు నమ్మకముగా" ఉన్నవారికి నిరీక్షణ అందించబడింది: వారు "జీవ కిరీటమును" పొందుకుంటారు (ప్రకటన 2:10). జయించిన వారికి యేసుతో కూడా ఆయన సింహాసనముపై "కూర్చోడానికి" అనుగ్రహిచబడుతుంది, ఎందుకంటే "ఆయన జయించి తన తండ్రితోకూడా తన సింహాసనమునందు కూర్చుండి" యున్నాడు గనుక (ప్రకటన 3:21). అయినను, అబద్ధ సిద్ధాంతాల వైపు, విగ్రహారాధన, లేదా దుష్టత్వమునకు తిరిగినవారు "పశ్చాత్తాప"పడుటకు ప్రోత్సహించబడ్డారు, లేనిచో "(తన) నోటనుండి వచ్చు ఖడ్గముచేత వారితో యుద్ధము చేయుటకు" ప్రభువు త్వరగా వస్తాడు (ప్రకటన 2:16).

ప్రభువు తన ప్రజలతో మునుపు మాట్లాడిన ఆదరణ మాటలు ఉన్నప్పటికి (ప్రకటన 1:5, 6 చూడండి), శోధించబడిన మరియు నిరుత్సాహపరచబడిన క్రైస్తవులకు నిరీక్షణ కలిగించులాగున మరి ఎక్కువ ఆదరణ మాటలు అవసరమైయున్నవి. దేవుని ప్రజలు బాగా నలుగగొట్టబడ్డారు. బాహ్యంగానైతే అపవాది గెలిచి యేసుక్రీస్తు కాక చక్రవర్తియే వాస్తవమైన ప్రభువు మరియు రక్షకుడు అనేటంతగా కనిపించింది–కాని దేవుడు ఇంకను తన సింహాసనముపై ఉన్నాడనియు ప్రపంచ పరిస్థితులను ఆయన తన స్వాధీనంలోనే ఉంచుకున్నాడనియు క్రైస్తవులు తెలుసుకోవాలని ఆయన ఆశించాడు.

రోమా సామ్రాజ్యము పట్ల తీర్పు కనిపెట్టుకుని ఉంది. కాలాంతములో, ఆ క్రూరమృగమును మరియు దాని ప్రతిమను మ్రొక్కిన ప్రతివారు, విశ్వసించని దుర్మార్గులతో కలిపి, గొప్ప ధవళవర్ణ సింహాసనపు తీర్పు ముందు నిలువబడి అగ్నిగుండములో శాశ్వత శిక్షావిధికి అప్పగింపబడతారు (ప్రకటన 19:19, 20;

20:11–15). ఈ తీర్పులను గూర్చి చర్చించే ముందు, దేవుడు ఇంకొక విధానాన్ని ప్రయత్నించాడు. అధికమైన తమ శ్రమల మధ్యలో, క్రైస్తవులు, యోహానుతో కూడా, అదృశ్యమైన వాటిని చూడవలసియుంది. వృద్ధ అపొస్తలుడైన యోహాను తన దర్శనములో జయకరమైన పరలోకపు దృశ్యాలను చూడగలిగాడు; తాను వ్రాసిన ప్రతి సంఘము కూడా తన సాక్ష్యమును చదివి ప్రభువు తనకు బయలుపరచిన దానిని తెలుసుకుంటారు.

ఆసియాలోని ఏడు సంఘములకు వ్రాయబడిన పత్రికలు బయలుపరచబడిన తరువాత (ప్రకటన 2:1–3:22), యోహాను పరలోకమునకు కన్నులెత్తి, యెష. 6:1–3; యెహెజ్కేలు 1:26–28; మరియు దానియేలు 7:9, 10లోని దృష్టాంత భాషలో వర్ణించబడిన సింహాసనముపై ఆసీనుడైనవానిని చూచుటకు అనుమతించబడ్డాడు (ప్రకటన 4:2–8). పరలోకములో ఉన్న సమూహమంతయు తండ్రియైన దేవుని మరియు కుమారుడైన దేవుని ఆరాధించుచు స్తుతిస్తూ ఉండగా (ప్రకటన 4:9–11; 5:9–14) ఆ సింహాసనముపై గొర్రెపిల్లను (యేసు) కూడా యోహాను చూసాడు. యెహెజ్కేలు 1లో వలే, ఇక్కడి పరిణామాలు కనబడే అంత బాగా లేవు. పరలోకమునకు మరియు భూలోకమునకు నిజమైన రాజు ఈ భూమిపై వాస్తవమైన సింహాసనముపై ఆశీనుడైనవాడు, అంటే నెబుకద్నెజరో లేక కైసరో కాదు. సమస్తమును స్వాధీనంలో ఉంచుకున్నవాడు దేవుడైన యెహోవా; ఆయన కుమారుడైన యేసుక్రీస్తు ఆయనతో కూడా పరలోకములో సింహాసనాసీనుడైయున్నాడు. యోహాను ఇలా రాస్తున్నాడు,

> ... అదిగో పరలోకమందు ఒక తలుపు తెరువబడియుండెను. మరియు నేను మొదట వినిన స్వరము బూరధ్వనివలె నాతో మాటలాడగా వింటిని. ఆ మాటలాడినవాడు–ఇక్కడికి ఎక్కిరమ్ము; ఇకమీదట జరుగవలసినవాటిని నీకు కనుపరచెదననెను. వెంటనే నేను ఆత్మవశుడనైతిని. అదిగో పరలోకమందు ఒక సింహాసనము వేయబడి యుండెను. సింహాసనమునందు ఒకడు ఆసీనుడై యుండెను, ఆసీనుడైనవాడు, దృష్టికి సూర్యకాంత పద్మరాగములను పోలినవాడు; *మరకతమువలె ప్రకాశించు ఇంద్రధనుస్సు సింహాసనమును ఆవరించియుండెను.* సింహాసనముచుట్టు ఇరువది నాలుగు సింహాసనములుండెను, ఈ సింహాసనములందు ఇరువదినలుగురు పెద్దలు తెల్లని వస్త్రములు ధరించుకొని, తమ తలలమీద సువర్ణ కిరీటములు పెట్టుకొన్నవారై కూర్చుండిరి. ఆ సింహాసనములో నుండి మెరుపులును ధ్వనులును ఉరుములును బయలు దేరుచున్నవి. మరియు ఆ సింహాసనము ఎదుట ఏడు దీపములు ప్రజ్వలించుచున్నవి; అవి దేవుని యేడు ఆత్మలు. మరియు ఆ సింహాసనము ఎదుట స్ఫటికమును పోలిన గాజువంటి సముద్రమున్నట్టుండెను. ఆ సింహాసనమునకు మధ్యను సింహాసనము చుట్టును, ముందు వెనుక కన్నులతోనిండిన నాలుగు జీవులుండెను. మొదటి

జీవి సింహమువంటిది; రెండవ జీవి దూడవంటిది; మూడవ జీవి మనుష్యుని ముఖము వంటి ముఖముగలది; నాలుగవ జీవి యెగురుచున్న పక్షిరాజువంటిది. ఈ నాలుగు జీవులలో ప్రతి జీవికి ఆరేసి రెక్కలుండెను, అవి చుట్టును రెక్కల లోపటను కన్నులతో నిండియున్నవి. అవి భూతవర్తమాన భవిష్యత్కాలములలో ఉండు సర్వాధికారియు దేవుడునగు ప్రభువు పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, పరిశుద్ధుడు, అని మానక రాత్రింబగళ్లు చెప్పుచుండును. ఆ సింహాసనము నందు ఆసీనుడైయుండి యుగయుగములు జీవించుచున్న వానికి మహిమయు ఘనతయు కృతజ్ఞతాస్తుతులును కలుగునుగాకని ఆ జీవులు కీర్తించుచుండగా ఆ యిరువది నలుగురు పెద్దలు సింహాసనమునందు ఆసీనుడై యుండువాని యెదుట సాగిలపడి, యుగయుగములు జీవించుచున్న వానికి నమస్కారము చేయుచు –ప్రభువా, మా దేవా, నీవు సమస్తమును సృష్టించితివి; నీ చిత్తమునుబట్టి అవి యుండెను; దానిని బట్టియే సృష్టింపబడెను గనుక నీవే మహిమ ఘనత ప్రభావములు పొందనర్హుడవని చెప్పుచు, తమ కిరీటములను ఆ సింహాసనము ఎదుట వేసిరి (ప్రకటన 4:1–11, ఉద్ఘాటన చేర్చబడినది).

ప్రోత్సాహకమైన యోహాను దర్శనములో ముఖ్యమైన విషయం "సింహాసనమును ఆవరించియున్న ఇంద్రధనుస్సు" (ప్రకటన 4:3). ఈ దృష్టాంతం చాలా శక్తివంతమైనది. జలప్రళయము ద్వారా నాశనము చేయబడిన ప్రపంచమును చూచుటకు నోవహు మరియు అతని కుటుంబము ఓడలో నుండి బయటకు వచ్చినప్పుడు, ధనుస్సును గూర్చిన నిబంధన వారికి ఒక నూతన ఆరంభమును గూర్చియు జీవితము యొక్క కొనసాగింపును గూర్చియు మరియు భూమిపై దేవుని ఆశీర్వాదాలను గూర్చియు నిరీక్షణ కలుగజేసింది. అదే విధంగా, బబులోను చెరలో ఉన్న యూదులకు పశ్చాత్తాప పడని యెరూషలేములోని మిగిలిన ప్రజలమీదికి మిక్కుటమైన దైవిక వినాశనము వస్తుందని వారికి తెలుపబడినపుడు, దేవుని సింహాసనమును ఆవరించియున్న ధనుస్సును చూసిన యెహెజ్కేలు దర్శనము చెర తరువాత నూతన ఆరంభమును గూర్చిన నిరీక్షణను సూచించింది. దేవుడు తన ప్రజలను వాగ్దాన దేశమునకు రప్పించి మునుపు వారిని ఆశీర్వదించిన రీతిగా మరలా వారిని ఆశీర్వాదిస్తాడని ఆ దర్శనం వారికి పునఃనిశ్చయత కలుగజేసింది.

మొదటి శతాబ్దపు ఆఖరు కాలంలో, కైసరు తానే "ప్రభువు, దేవుడు మరియు రక్షకుడు" అని ప్రకటించుకున్న క్రమంలో, అట్టి డంబములోగల అబద్ధాన్ని యోహాను యొక్క దర్శనము బయలుపరచి నిజమైన "ప్రభువు, దేవుడు మరియు రక్షకుడు" పరలోక సింహాసనంపై ఆసీనుడైన యేసుక్రీస్తే అని జ్ఞాపకము చేయుటకు దోహదపడింది. యోహాను పరలోకముతట్టు తేరి చూసి సింహాసనమును ఆవరించియున్న ఇంద్రధనుస్సును చూచినప్పుడు, దేవుని

ప్రజలకు తీర్పు నడుమ కృపను ఆ దృశ్యం సూచించింది. అది వారికి భవిష్యత్తును గూర్చిన నిరీక్షణను ఇచ్చింది—ఈ జీవితంలో కాకపోయినను, క్రొత్త భూమి క్రొత్త ఆకాశములో నిత్యత్వమును గూర్చిన నిరీక్షణ వారికి కలుగజేసింది. అక్కడ దేవుడు ప్రతివాని బాష్పబిందువును తుడిచివేయుటవలన, రక్షింపబడినవారు మరణమును, దుఃఖమును, ఏడ్పును, వేదనను మరి అనుభవించరు; ఏలయనగా ఆయన సమస్తమును నూతన పరచును (ప్రకటన 21:1–5). నిత్యత్వంలో, క్రీస్తులోని నూతన సృష్టి తన అంతిమ నేరవేర్పును పొందుతుంది (2 కొరింథీ. 5:17), యుగములన్నిటిలో విమోచింపబడినవారు ఇంద్రధనుస్సు ఆవరించియున్న ఆ సింహాసనము యెదుట కూడి, తరతరముల వరకు దేవుని మరియు ఆ గొర్రెపిల్లను (యేసును) స్తుతిస్తూ ఉంటారు.

## **"నిత్యనిబంధన" (9:16)**

"త్య నిబంధన" లేదా "నిరంతరమూ ఉండే నిబంధన"గా అనువదించబడే హెబ్రీ పదసమూహమైన עוֹלָם בְּרִית (*b^erith ʻolam*), పాతనిబంధనలో పదహారు సార్లు వస్తుంది. ఈ పదప్రయోగమును అవలోకనము చేసి, *ʻolam* అనే పదము యొక్క బహుళ అర్థములను పరిగణించుదాము.

సాధారణంగా నిబంధనలు ఇరుపక్షాల మధ్య కట్టుబడి ఉంటుండగా, దేవుడు కొన్నిసార్లు కేవలం తన మీదనే కట్టుబడి ఉండేటువంటి నిబంధనలను ఒక వాగ్దానం నెరవేర్చుటకు చేశాడు. దేవుడు నోవహుతో చేసిన నిబంధనకు, ఉదాహరణకు చూస్తే, ఒకే షరతు ఉంది: దేవుడు మరల భూమిమీదికి జలప్రళయమును రప్పించడు అనునదియే.

> "నేను మీతో నా నిబంధన స్థిరపరచుదును; సమస్త శరీరులు ప్రవాహ జలములవలన ఇకను లయపరచబడరు; భూమిని నాశనము చేయుటకు ఇకను జలప్రవాహము కలుగదని పలికెను ... ఆ ధనుస్సు మేఘములో నుండును. నేను దాని చూచి దేవునికిని భూమిమీదనున్న సమస్త శరీరులలో ప్రాణముగల ప్రతి దానికిని మధ్యనున్న *నిత్యనిబంధనను* జ్ఞాపకము చేసికొందుననెను" (9:11–16; ఉద్ఘాటన చేర్చబడినది).

కొన్ని తరముల తరువాత, దేవుడు అబ్రాహాముతో ఒక నిబంధన చేశాడు. ఇది అబ్రాహాము కుటుంబమునకు బంధించిన సున్నతిని గూర్చిన ఆచారము, అనగా వారు దేవుని ప్రజలనుటకు ఒక భౌతిక గురుతుగా ఉంది.

> "నేను నీకును నీ తరువాత నీ సంతానమునకును దేవుడనై యుండునట్లు, నాకును నీకును, నీ తరువాత వారి తరములలో నీ సంతతికిని మధ్య నా నిబంధనను నిత్యనిబంధనగా స్థిరపరచెదను. నీకును నీతరువాత నీ సంతతికిని ... దేవుడనై యుందునని అతనితో చెప్పెను ... నీ యింట పుట్టినవాడును నీ

> వెండితో కొనబడినవాడును, తప్పక సున్నతి పొందవలెను. అప్పుడు నా నిబంధన మీ శరీర మందు *నిత్యనిబంధనగా* ఉండును" (17:7–13; ఉద్ఘాటన చేర్చబడినది).

వాగ్దాన పుత్రుని ద్వారా దేవుని నిబంధన అబ్రాహాము సంతతివారికి కూడా అందించబడుతుంది:

> దేవుడు, "... నీ భార్యయైన శారా నిశ్చయముగా నీకు కుమారుని కనును; నీవతనికి ఇస్సాకు అను పేరు పెట్టుదువు; అతని తరువాత అతని సంతానముకొరకు *నిత్యనిబంధనగా* నా నిబంధనను అతనితో స్థిరపరచెదను" అని చెప్పెను (17:19; ఉద్ఘాటన చేర్చబడినది).

వాగ్దాన దేశము ఇస్తాననిన దేవుని "కట్టడ" అబ్రాహాము కుమారుడైన ఇస్సాకుకు, తన మనుమడైన యాకోబుకు "నిత్యనిబంధన"గా నిశ్చయించబడింది (1 దిన. 16:6–18; కీర్తనలు 105:9–11).

అబ్రాహాము కుటుంబము ఒక దేశముగా ఇశ్రాయేలు జనాంగముగా విస్తరించింది. ఐగుప్తులోని బానిసత్వము నుండి దేవుడు ఇశ్రాయేలీయులను బయటకు నడిపించినప్పుడు, ఆయన వారిని తన సొత్తుగా పిలిచాడు, మరియు మోషే ద్వారా ఒక విశిష్టమైన ధర్మశాస్త్రమును కలిగి ఉన్న నిబంధనను కూడా వారికి ఇచ్చాడు. ఆ ధర్మశాస్త్రములోని ఒక భాగము వారు విశ్రాంతి దినాన విశ్రాంతి తీసుకోవాలని కోరింది: "ఇశ్రాయేలీయులు తమ తరతరములకు విశ్రాంతి దినాచారమును అనుసరించి ఆ దినము నాచరింపవలెను; అది *నిత్యనిబంధన* (నిర్గమ. 31:16; ఉద్ఘాటన చేర్చబడినది). దేవుడు యాజకుల సేవను గూర్చి మరియు ధర్మశాస్త్రములో ఉన్న బలులను గూర్చి "నిత్యనిబంధనగా పరిగణించాడు:

> "యాజకుడు అహరోను ప్రతి విశ్రాంతి దినమున *నిత్యనిబంధననుబట్టి* ఇశ్రాయేలీయుల యొద్ద దాని తీసికొని (ప్రత్యక్షగుడారమును, దాని ప్రశస్తమైన గురుతులతో) నిత్యము యెహోవా సన్నిధిని చక్కపరచవలెను" (లేవీ. 24:8; ఉద్ఘాటన చేర్చబడినది; సంఖ్యా. 18:19 చూడండి).

తరువాత, దేవుడు దావీదుతో ప్రత్యేకమైన నిబంధన చేశాడు, తన సింహాసనముపై శాశ్వతముగా కూర్చుండే తన సంతానమును గూర్చి వాగ్దానం చేశాడు. ఆయన మరణ సమయములో, "... ఆయన నాతో *నిత్యనిబంధన* చేసియున్నాడు ... నిశ్చయముగా ఆయన దానిని నెరవేర్చును" అని దావీదు అన్నాడు (2 సమూ. 23:5; ఉద్ఘాటన చేర్చబడినది).

నిబంధనలో ఇశ్రాయేలీయుల పాత్ర దేవునికి విధేయులై యుండటమే; ఆయన వారికి దేవుడుగా, వారు ఆయనకు ప్రజలుగా ఉండవలసి యుంది.

విధేయత అనే వారి బాధ్యత విషయంలో వారు పలుమార్లు విఫలమయ్యారు, కాబట్టి ప్రవక్తల ద్వారా వారికి పలుమార్లు జ్ఞాపకము మరియు హెచ్చరికలు చేయబడ్డాయి:

“లోకనివాసులు ధర్మశాసనములను అతిక్రమించి యున్నారు
కట్టడను మార్చి *నిత్యనిబంధనను* మీరియున్నారు.
దాని నివాసులచేత లోకము అపవిత్రమాయెను"
(యెష. 24:5; ఉద్ఘాటన చేర్చబడినది).

“చెవియొగ్గి నాయొద్దకు రండి
మీరు వినినయెడల మీరు బ్రదుకుదురు
నేను మీతో *నిత్యనిబంధన* చేసెదను
దావీదునకు చూపిన శాశ్వతకృపను మీకు చూపుదును”
(యెష. 55:3; ఉద్ఘాటన చేర్చబడినది).

“ఏలయనగా న్యాయముచేయుట యెహోవానగు నాకిష్టము
ఒకడు అన్యాయముగా ఒకనిసొత్తు పట్టుకొనుట నాకసహ్యము.
సత్యమునుబట్టి వారి క్రియాఫలమును వారికిచ్చుచు
వారితో *నిత్యనిబంధన* చేయుదును”
(యెష. 61:8; ఉద్ఘాటన చేర్చబడినది).

“నేను వారికి మేలు చేయుట మానకుండునట్లు నిత్యమైన *నిబంధనను* వారితో చేయుచున్నాను; వారు నన్ను విడువకుండునట్లు వారి హృదయములలో నా యెడల భయభక్తులు పుట్టించెదను” (యిర్మీయా 32:40; వక్కాణం జోడించబడెను).

“ఎన్నటికిని మరువబడని *నిత్యనిబంధన* చేసికొని
యెహోవాను కలిసికొందము రండని చెప్పుకొనుచు
సీయోనుతట్టు అభిముఖులై అచ్చటికి వెళ్లు మార్గము ఏదని అడుగుచు
వచ్చెదరు
ఇదే యెహోవా వాక్కు” (యిర్మీయా 50:5; వక్కాణం జోడించబడెను).

“నీ యౌవన దినములయందు నేను నీతో చేసిన నిబంధనను జ్ఞాపకమునకు తెచ్చుకొని యొక *నిత్య నిబంధనను* నీతో చేసి దాని స్థిరపరతును” (యెహెజ్కేలు 16:60; వక్కాణం జోడించబడెను).

“నేను వారితో సమాధానార్థమైన నిబంధన చేసెదను, అది నాకును వారికిని *నిత్యనిబంధనగా* ఉండును, నేను వారిని స్థిరపరచెదను, వారిని విస్తరింపజేసి వారిమధ్య నా పరిశుద్ధస్థలమును నిత్యము ఉంచెదను” (యెహెజ్కేలు 37:26; వక్కాణం జోడించబడెను).

పాత నిబంధనలో *'olam* అనేపదము తరచుగా వస్తుండుట మరియు వివిధ సందార్భాలలో ఈ పదమునకు అనేక అర్థాలు ఉండుట వలన ఈపదమునకు కొంత వివరణ అవసరమైయుంది.[29] యెహోవాను గూర్చి మరియు ఆయన యొక్క గుణాతిశయములనుగూర్చి మాట్లాడేటప్పుడు ఇది "నిత్యమైన" లేక"నిత్యత్వము" అనే అర్థాన్ని ఇస్తుంది ఎందుకంటే ఇది దేవుని నిత్యమైన గుణమును మరియు లక్షణాలను సూచిస్తుంది (21:33; ద్వితీ. 32:40; కీర్తనలు 90:2; 145:13; యెష. 40:28; దాని. 12:7). అయినప్పటికీ, ఈ పదము ఎల్లప్పుడూ కూడా "సదాకాలము" అనే అర్థాన్ని ఇవ్వదు.

ఆదికాండము యొక్క ఆరంభములో, మానవుని జీవిత కాలమును గూర్చి మాట్లాడే సందర్భంలో ఈ ప్రాముఖ్యమైన పదమునకు మనము పరిచయం చేయబడ్డాము,ఆ జీవితము "నిరంతరం" ఉండేది కాదు (3:22; 6:3). తరువాత, మానవుని జీవితమును గూర్చి మాట్లాడే టప్పుడు, *'olam* అనే పదము "నిత్యము" అని అనువదింపబడినప్పటికి, అది ఒక భాషారూపముగానే చెప్పబడింది. ఈ పదము వ్యక్తికి ఇచ్చే ఒక మర్యాదపూర్వకమైన మరియు గౌరవప్రదమైన నమస్కారముగా ఉంది. వయసైన తన పెనిమిటి మంచము వద్దకు బత్షెబ వచ్చినప్పుడు, "నా యేలినవాడైన రాజగు దావీదు సదాకాలము బ్రదుకును గాక" అని పలికింది (1 రాజులు 1:31). ఈ మాట దీర్ఘాయువుతో తన భర్త ఆశీర్వదించబడాలనే తన ఆశను తెలుపుతుంది. పారసీక రాజైన అర్తహషస్తకు కూడా నెహెమ్యాఈ మాటలతోనే నమస్కారం చేసాడు (నెహెమ్యా 2:3).

దీనికి విరుద్ధంగా, యెరూషలేము మరియు తూరు లాంటి పట్టణములు "ఎన్నటికిని" శిథిలముల క్రింద ఉండునట్లుగా, లేదా "మరెన్నడును" తిరిగి కట్టబడకుండునట్లుగా వాటిపై దైవికమైన శాపములు చేయబడినప్పుడు (యెష. 32:14; యెహెజ్కేలు 26:21; 27:36; 28:19), *'olam* మాములుగా సుదీర్ఘ కాలాన్ని సూచించింది. ఈ రెండు పట్టణములు తరువాత తిరిగి కట్టబడి ఈ నాటికి కూడా మనుగడలో ఉన్నాయి.

దేవుడు ఈ భౌతికమైన భూమిని "యెన్నటికిని [*'olam*] కదలకుండునట్లు దానిని పునాదులమీద స్థిరపరచెను" అని కీర్తనకారుడు అన్నాడు (కీర్తనలు 104:5). ఈ భూమి నిరవధిక భవిష్యత్కాలం పాటు, లేదా సుదీర్ఘ కాలం పాటు అలానే ఉంటుంది; అది తరతరములు ఉంటుంది కాని నిత్యత్వము వరకు కొనసాగదు. ప్రభువు యొక్క రాకడను గూర్చిన "వాగ్దానము" ఈ యుగము యొక్క అంతమందు నెరవేర్చబడుతుందని క్రొత్త నిబంధన తెలియజేస్తుంది (2 పేతురు 3:4). అప్పుడు"భూమి" మరియుభౌతిక విశ్వము "దహించివేయబడి" "నాశనము" అవుతాయి; అవి "మహాపేంఢ్రముతో లయమైపోవును" (2 పేతురు 3:7, 10–12). ఆ తరువాత "ఆకాశమునుభూమియు గతించును" (మత్తయి24:35), మరియు "నూతన ఆకాశము" మరియు"నూతన భూమి"

విమోచింపబడినవారికందరికీ ఒక నిత్యమైన నివాసముగా ప్రత్యక్షపరచ బడుతుంది (ప్రకటన 21:1, 10; 22:19; 2పేతురు 3:13 చూడండి). కాబట్టి, ఆదికాండము 9:16లో దేవుడు నోవహుతో చేసిన "నిత్యమైన [*'olam*] నిబంధన" ఈ భూమి ఉన్నంతమట్టుకే వర్తిస్తుందని ఆశించగలము.

*'Olam* అను పదమును "సదాకాలము" లేదా "నిత్యము" అని అనువదించడం అనేది, ఆదికాండము 13:15ను ఆధారము చేసుకొని, దేవుడు కనాను దేశమును అబ్రాహాము సంతానమునకు (యూదులకు) సదాకాలము ఇచ్చెదను అనునది కొంతమందిని తప్పుదారి పట్టించింది. సమయ కారణం నిరవధికంగా ఉంచగలిగే "సుదీర్ఘ కాలం" లేదా "తరములకు ఉండు" అను పదాలు ఆ సందర్భంలో సరియైన అనువాదం అని చెప్పవచ్చు. పాత నిబంధన కాలములో ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశమును స్వతంత్రించుకొనడం అనునది వారు దేవునికి విధేయు లైయుండుటపై ఆధారపడి ఉండేది. ఒకటికంటే ఎక్కువ మారులు, వారి తిరుగుబాటును బట్టి దేవుడు తన ప్రజలను ఆ దేశమునుండి తొలగించాడు. అబ్రాహాము మరియు మోషేల ద్వారా దేవుడు ఇశ్రాయేలుతో చేసిన నిబంధనలు నేడు చెల్లనివాయెను. అవితన నూతన నిబంధనను ఆవిష్కరించిన క్రీస్తులో నెరవేర్చబడ్డాయి (గలతీ. 3:8–29; హెబ్రీ. 8:13).

"అమ్మోనీయుడేగాని మోయాబీయుడేగాని యెహోవా సమాజములో చేరకూడదు. వారిలో పదియవ తరము వారైనను ఎన్నడును [*'olam*] యెహోవా సమాజములో చేరకూడదు" (ద్వితీ. 23:3) అని ధర్మశాస్త్రములో దేవుడు తన ప్రజలకు ఉపదేశించాడు. ఇక్కడ *'olam* అనే పదము స్పష్టంగా సుదీర్ఘ కాలాన్ని (పది తరములను) సూచిస్తుంది–అది "ఎన్నడును" అని అనువదింపబడినప్పటికీ "నిరంత రము" అని అక్షరార్థం మాత్రం కాదు. ఒకవేళ అది నిజంగానే "ఎన్నడును" అనే అర్థాన్ని ఇస్తున్నట్లైతే, దావీదు మోయాబీయులు–ఇశ్రాయేలీయులకు చెందిన బోయజు రూతుల వివాహ సంబంధం నుండి వచ్చినవాడు గనుక ఆయన "యెహోవా సమాజములోనుండి బహిష్కరించ బడేవాడు" (రూతు 4:10–22).

*'olam* అను పదం, సమూయేలు తల్లియైన హన్నాను గూర్చిన కథలో వలె, కొన్నిసార్లు వాక్యభాగము యొక్క సందర్భమును బట్టి నిర్వచించబడుతుంది. ఆమె ఒక కుమారుని కొరకు నిష్ఠతోప్రార్థించి "వాడు బ్రదుకు దినములన్నిటను నేను వానిని యెహోవావగు నీకు అప్పగింతునని" ప్రమాణముచేసుకొనెను (1 సమూ. 1:11b). బిడ్డ జన్మించిన తరువాత, "వాడు యెహోవా సన్నిధిని అగుపడి తిరిగి రాక అక్కడనే ఉండునట్లుగా [*'olam*]" తను పాలు విడిచిన తరువాత దేవుని సన్నిధికి బిడ్డను తీసుకువెళ్లుదునని ప్రమాణము చేసెను (1 సమూ. 1:22). ఆ సమయము ముగిసిన తరువాత యాజకుడగు ఏలీ యొద్దకు బిడ్డను తీసుకొచ్చి, "నేను ఆ బిడ్డను యెహోవాకు ప్రతిష్ఠించుచున్నాను; తాను బ్రదుకు దినములన్నిటను వాడు యెహోవాకు ప్రతిష్ఠితుడని" చెప్పింది

(1 సమూ. 1:28). ఈ వాక్యము ‘olam అను పదమును “తను బ్రదుకు దినములన్నియు,” లేదా జీవితకాలమంతయు అని వివరిస్తుంది.

సందర్భసహిత నిర్వచనమునకు మరొక ఉదాహరణను దుష్టులైన అన్యజనులకు ప్రకటించుటకుగాను నీనెవె పట్టణమునకు వెళ్లుటకు నిరాకరించి వ్యతిరేక దిశగా వెళ్తున్న ఓడను ఎక్కినటువంటి యోనా కథలో చూడగలము. ఘోరమైన తుఫాను ఆ ఓడను నీట ముంచినప్పుడు, యోనా సముద్రములో పడవేయబడి ఒక మత్స్యముచే మ్రింగబడ్డాడు. తరువాత యోనా ఆ సముద్రపు నాచు తనను చుట్టుకొనిన రీతిని తెలుపుతూ అంటాడు, “నేను మరెన్నటికిని [*‘olam*] ఎక్కిరాకుండ భూమి గడియలు వేయబడియున్నవి, నీవు నా ప్రాణము కూపములోనుండి పైకి రప్పించియున్నావు” (యోనా 2:5,6).ఆ గొప్ప మత్స్యముయొక్క కడుపులో తాను గడిపిన సమయమును యోనా “మరెన్నటికిని”గా అని తెలిపినప్పటికీ, ఈ వాక్యము యొక్క రచయిత ఇది కేవలము “మూడు పగళ్లు మరియు మూడు రాత్రులు” మాత్రమే ఉన్నదని చెప్పాడు (యోనా 1:17; మత్తయి 12:39–41 చూడండి).

ఈ ఉదాహరణలు మనకు “నిత్యము” లేదా “ఎన్నటికిని” (*‘olam*) అనేపదముల అర్థము సందర్భమును బట్టి రాబట్టవలెనని తెలుపు తున్నాయి. ఇదియుగాక, దేవుని నిబంధనలు కొన్నిసార్లు మానవుల యొక్క విధేయతపై ఆధారపడి ఉంటుంది అని కూడా అవి సూచిస్తున్నాయి.

### త్రాగుట మరియు త్రాగుడు (9:20, 21)

మద్యమును సేవించడమును గూర్చి బైబిల్ సంపూర్ణమైన నిషేధం ఏమి ఇవ్వడంలేదు. ప్రాచీనప్రపంచంలోద్రాక్షరసము అనునది ఒక సాధారణ పానముగా కనబడుచున్నది. కీర్తనకారుడు ఉద్భిజ్జము, ఆహారము(రొట్టె), మరియు ద్రాక్షరసమును దేవుడు మానవులకిచ్చిన వరముగా భావించి, ద్రాక్షారసము గూర్చి అయితే “నరుల హృదయమును సంతోషపెట్టును” అనిచెప్తున్నాడు(కీర్తనలు 104:14, 15; ప్రసంగి 9:7; జెకర్యా 10:7 చూడండి). జ్ఞానియైతే ఎవరి జీవితం చేదుగా ఉండి కష్టతరంగా ఉంటుందో అట్టి వాడు తన కష్టములను మరచిపోవుటకు గాను కొంచెం ద్రాక్షారసమును తీసుకొనవచ్చని కూడ అంటున్నాడు (సామెతలు 31:6, 7). మోషే ధర్మశాస్త్రము ప్రకారము, ప్రతి ఒక్క దహన బలి మరియు సమాధాన బలి ద్రాక్షారసమనే పానార్పణముతో చేయాలి (సంఖ్యా. 15:5–10), మరియు ప్రజలు తమ ఆరాధన స్థలముల యొద్ద, అనగా దేవుడు తన నామమును స్థిరపరచిన చోట (ద్వితీ. 14: 24–26), దానిని కొనుగోలు చేయునట్లు ప్రోత్సహించబడ్డారు.

త్రాగుడువలన వచ్చే అపాయము వలన చాలా మంది బైబిల్ రచయితలు మిగుల లోలత్వం గూర్చి హెచ్చరించారు (సామెతలు 20:1; 21:17; 23:29–35;

31:4, 5; యెష. 5:11, 12; హబక్కూకు 2:5). కొన్ని వాక్య భాగములలో అయితే బలమైన పానము దుర్వ్యాపారముతోనూ మరియు వ్యభిచారముతోనూ చేర్చబడింది (ఆది. 19:30–38; హోషెయా 4:11, 12). నూతన నిబంధన కాలములో, మద్యపానము వలన కలుగు ప్రమాదములను పౌలు యెరిగియున్నాడు. గ్రీకు–రోమీయుల ప్రపంచంలో మద్యపానముతో కూడుకొనిన నృత్యములు అన్యదేవతల దేవాలయ ఆరాధనలలో భాగములు, కాబట్టి పౌలు దీనిని గూర్చి మాట్లాడుతూ దేవుని రాజ్యములో ఒకని స్వాస్థ్యమును కోల్పోయేటట్లు చేసే ఒక శరీర క్రియగా చెప్పాడు (1 కొరింథీ. 6:9, 10; గలతీ. 5:19–21).

అయినప్పటికీ, మద్యము సేవించే విషయములో పౌలు పూర్తి నిషేధము మరియు పరిపూర్ణ స్వతంత్రము అనే వాటికి మధ్య ఉన్న మార్గాన్ని తీసుకున్నాడు. మాంసమును తిని ద్రాక్షారసమును పానము చేయు సహోదరులను తీర్పుతీర్చుటకు కూర్చునే, ఖండించే క్రైస్తవులతో పౌలు ఏకీభవించలేదు గాని, “దేవుని రాజ్యము భోజనమును పానమును కాదు గాని, నీతియు సమాధానమును పరిశుద్ధాత్మయందలి ఆనందమునై యున్నది” అని చెప్పాడు (రోమా. 14:17). అదే సమయంలో, దేవుని ప్రజలు తమ సహోదరుల మనసాక్షి విషయంలో వారిని తొట్రిల్లజేసే పరిస్థితులయందు తమకిచ్చిన స్వతంత్రమును మాంసమును తినుటయందో లేక మద్యమును సేవించుటయందో వినియోగింపక, కొంచెం సున్నితంగా ప్రవర్తించి ప్రేమతో మెలగాలని హెచ్చరిక చేసాడు (రోమా. 14:14, 15, 22). సమాధానమునకు ఉపకరించు విషయములయందు ఆసక్తి చూపుతూ “భోజనము నిమిత్తము దేవుని పనిని పాడుచేయకుడి” (రోమా. 14:19, 20) అని క్రైస్తవులను పౌలు కోరాడు. “సమస్త పదార్థములు పవిత్రములే” అని చెప్తూనే వాటిని అనుమానించేవారికి అవి “దోషము” అని పలికాడు (రోమా. 14:20).[30] “మాంసము తినుట గాని, ద్రాక్షారసము త్రాగుటగాని, నీ సహోదరుని కడ్డము కలుగజేయునది మరేదియు గాని, మానివేయుట మంచిది” అని పలుకుతూ అపొస్తలుడు ముగించాడు (రోమా. 14:21)[31].

## ఆదికాండము వెలుపల నోవహు

ప్రవక్తల గ్రంథములలో మరియు క్రొత్త నిబంధన పుస్తకములలో నోవహును గూర్చిన ప్రస్తావనలు గొప్ప జలప్రళయములో జీవించిన ఒక వాస్తవమైన వ్యక్తిగా ఆయనను గూర్చి బలమైన అంతర్గత రుజువులను చేకూరుస్తున్నాయి. దేవుడు నోవహును గురించి ఒక చారిత్రక వ్యక్తిగా యెషయా ద్వారా పలికాడు:

నోవహు కాలమున జలప్రళయమునుగూర్చి నేను చేసినట్లు చేయుదును

జలములు భూమిమీదికి ఇకను పొర్లుచురావని
నోవహు కాలమున నేను ఒట్టుపెట్టుకొనినట్లు
నీమీద కోపముగా నుండననియు నిన్ను గద్దింపననియు
నేను ఒట్టు పెట్టుకొనియున్నాను (యెష. 54:9).

యెహెజ్కేలు ప్రాచీన కాలపు నీతిగల మనుష్యుల జాబితాలో నోవహును గూర్చి ప్రస్తావించాడు: "నోవహును దానియేలును యోబును ఈ ముగ్గురు అట్టిదేశములో నుండినను వారు తమ నీతిచేత తమ్మునుమాత్రమే రక్షించు కొందురు, ఇదే ప్రభువగు యెహోవా వాక్కు" (యెహెజ్కేలు 14:14).

యేసుక్రీస్తును "దేవుని కుమారుడైన ఆదాము" వరకు జాడదీయు వంశావళిలో నోవహు యొక్క ప్రత్యక్షత, ఖచ్చితముగా అయన మనుగడకు నమ్మకత్వాన్ని ఇస్తుంది (లూకా 3:23–38). తన రెండవ రాకడలో కలిగే పరిస్థితులను వివరించేటప్పుడు యేసు నోవహు యొక్క అనుభవాలను ఉపయోగించాడు:

నోవహు దినములు ఏలాగుండెనో మనుష్యకుమారుని రాకడయును ఆలాగేఉండును. జలప్రళయమునకు ముందటి దినములలో నోవహు ఓడలోనికి వెళ్లిన దినమువరకు, వారు తినుచు త్రాగుచు పెండ్లిచేసికొనుచు పెండ్లికిచ్చుచునుండిరి (మత్తయి 24:37, 38; లూకా 17:26, 27 చూడండి).

హెబ్రీ పత్రిక రచయిత మరియు అపొస్తలుడైన పేతురు దేవుని పట్ల నోవహు యొక్క నమ్మకత్వములో నుండి కొన్ని పాఠాలు తీసుకొనిరి:

విశ్వాసమునుబట్టి నోవహు అదివరకు చూడని సంగతులనుగూర్చి దేవునిచేత హెచ్చరింపబడి భయభక్తులు గలవాడై, తన యింటివారి రక్షణకొరకు ఒక ఓడను సిద్ధముచేసెను; అందువలన అతడు లోకముమీద నేరస్థాపనచేసి విశ్వాసమునుబట్టి కలుగు నీతికి వారసుడాయెను (హెబ్రీ. 11:7).

... దేవుని దీర్ఘశాంతము ఇంక కనిపెట్టుచుండినప్పుడు పూర్వము నోవహు దినములలో ఓడ సిద్ధపరచబడుచుండగా, అవిధేయులైన వారియొద్దకు, అనగా చెరలో ఉన్న ఆత్మల యొద్దకు, ఆయన ఆత్మరూపిగానే వెళ్లివారికి ప్రకటించెను. ఆ ఓడలో కొందరు, అనగా ఎనిమిది మంది నీటి ద్వారా రక్షణపొందిరి (1 పేతురు 3:18–20).

దేవుడు ... భక్తిహీనుల సమూహము మీదికి జలప్రళయమును రప్పించినప్పుడు, నీతిని ప్రకటించిన నోవహును మరియేడుగురిని కాపాడెను; ... భక్తులను శోధనలోనుండి తప్పించుటకును, దుర్ణీతి పరులను ముఖ్యముగా మలినమైన దురాశకలిగి శరీరానుసారముగా నడుచుకొనుచు, ప్రభుత్వమును నిరాకరించు చుశిక్షలో ఉంచబడినవారిని తీర్పుదినము వరకు కావలిలో

ఉంచుటకును, ప్రభువు సమర్థుడు (2 పేతురు 2:4–10).

---

సూచనలు

[1]Jacob Milgrom, "Blood," in *Encyclopaedia Judaica*, 2d ed., ed. Fred Skolnik (Detroit: Macmillan Reference USA, 2007), 3:771. [2]S. David Sperling, "Blood," in *The Anchor Bible Dictionary*, ed. David Noel Freedman (New York: Doubleday, 1992), 1:762చూడండి. [3]Leonard J. Coppes, "דָּרַשׁ," in *TWOT*, 1:199. [4]Kenneth A. Mathews, *Genesis 1–11:26*, The New American Commentary, vol. 1A (Nashville: Broadman& Holman Publishers, 1996), 404. [5]ఇది హెబ్రీ పదమునకు మరియొక సాధ్యమగు అర్థము. (Coppes, "קוּם," in *TWOT*, 2:793.) [6]Victor P. Hamilton, *The Book of Genesis: Chapters 1–17*, The New International Commentary on the Old Testament (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1990), 316. [7]Coppes, "קֶשֶׁת," in *TWOT*, 2:819. [8]నోవహు కాలము తరువాత, ప్రాచీన పురాణము ఒకటి ఆకాశములో తన శత్రువులపై బాణమును మరియు (పిడుగులవంటి) విల్లును ప్రయోగించిన దేవునిని గూర్చిన ఒక ఊహాచిత్రాన్ని కూడా కలిగియుంది. [9]W. Schottroff, "זכר," in *Theological Lexicon of the Old Testament*, trans. Mark E. Biddle, ed. Ernst Jenni and Claus Westermann (Peabody, Mass.: Hendrickson Publishers, 1997), 1:383. [10]F. J. Helfmeyer, "אוֹת," in *Theological Dictionary of the Old Testament*, trans. John T. Willis, ed. G. Johannes Botterweck and Helmer Ringgren (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1974), 1:177.

[11]సున్నతి చేయబడిన సిరియ యోధులను గూర్చిన చిత్రణములు క్రీ.పూ. మూడవ సహస్రాబ్ది మొదటి కాలమునకు చెందినవిగా ఉన్నాయి. (Jack M. Sasson, "Circumcision in the Ancient Near East," *Journal of Biblical Literature* 85, no. 4 [December 1966]: 475–76.) ఐగుప్తీయుల సున్నతిని గూర్చిన చిత్రణలు దరిదాపుగా క్రీ.పూ. 2300 సంవత్సరము నుండి ఉన్నవి. (John A. Wilson, trans., "Circumcision in Egypt," in *Ancient Near Eastern Texts: Relating to the Old Testament*, 3d ed., ed. James B. Pritchard [Princeton, N.J.: Princeton University Press, 1969], 326.) [12]John T. Willis, *Genesis*, The Living Word Commentary (Austin, Tex.: Sweet Publishing Co., 1979), 181. "ప్రారంభమైనది" అనే క్రియారూపము חָלַל (*chalal*) అనే పదము నుండి వచ్చింది; ఈ పదము యొక్క రూపములు 4:26; 6:1; 11:6లలో "మొదలైంది" అని కూడా అనువదించబడినవి. NIV అనే అనువాదం 9:20 యొక్క అనువాదాన్ని ఈ విధంగానే చేస్తుంది: "నోవహు వ్యవసాయము చేయనారంభించి, ద్రాక్షతోట వేయుటకు *కొనసాగించెను*" (వక్కాణం జోడించబడెను). [13]Jon D. Levenson, "Genesis," in *The Jewish Study Bible*, ed. Adele Berlin and Marc Zvi Brettler (New York: Oxford University Press, 2004), 25. [14]అయినను, పురావస్తు శాస్త్రజ్ఞులు మొదటి సారిగా ద్రాక్షలను కనుగొనడం అర్మేనియాలోని ఒక గుహలో జరిగింది, ఇక్కడే నోవహు యొక్క ఓడ కూడావిరమించింది. (http://news.nationalgeographic.com/news/2011/01/110111-oldest-wine-

press-making-winery-armenia-science-ucla/; Internet; accessed 20 December, 2013.) బబులోను సంప్రదాయములో, ద్రాక్ష యొక్క ఉత్పత్తి గొప్ప జలప్రళయము కంటే కూడా ముందు జరిగింది. (*The Epic of Gilgamesh* 11.72–73.) [15]H. C. Leupold, *Exposition of Genesis*, vol. 1 (N.p.: Wartburg Press, 1942; reprint, Grand Rapids, Mich.: Baker Book House, 1953), 345. [16]F. Brent Knutson, "Naked," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1986), 3:480.ప్రకటన 16:15పై వ్యాఖ్యానించేటప్పుడు, "మెలకువగా ఉండి వస్త్రములు ధరించి ఉండటం అనేది నిద్రలో ఉంది వివస్త్రునిగా ఉండుటకు వ్యతిరేకంగా ఉంది" అని Knutsonఅన్నాడు. [17]Leupold, 346. [18]*The Tale of Aqhat* A.1.32–33. [19]Willis, 183. నోవహు యొక్క శాపము కనాను సంతానమైన ఏడు దేశములకు సంబంధించినదిగా ఉంది; యెహోషువా మరియు ఇశ్రాయేలీయులు కనాను దేశమును స్వతంత్రము చేసుకున్నప్పుడు (ద్వితీ. 7:1–11) ఈ దుష్ట జనాంగము దానిని ఆక్రమించుకున్నారు. ఈ శాపము హాము యొక్క ఇతర సంతానమునకు,అనగా ఆఫ్రికాలో స్థిరపడిన వారికి వర్తించదు (కీర్తనలు 105:23; 106:21, 22 చూడండి). చారిత్రకంగా, కొందరు ఆదికాండము 9:25ను ఆఫ్రికా జాతికి చెందిన వారిని లోపరచుకొని దౌర్జన్యము చేయుటను సమర్థించుకొనుటకు ఒక మద్దతు వాక్యముగా దురుపయోగించుకుంటున్నారు. [20]15:16లో కనానులో ఉన్న వాసులు అమోరీయులుగాపిలువబడ్డారు, అంటే ఇశ్రాయేలీయులు వాగ్దాన దేశము నుండి పారద్రోలిన వారికి ఉపయోగించే మరియొక పదముగా ఇది ఉంది (న్యాయాధి. 6:10; 1 సమూ. 7:14; 1 రాజులు 21:26; 2 రాజులు 21:11).

[21]Theophilus Goldridge Pinches and Roland K. Harrison, "Japheth," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1982), 2:967. [22]"Targum of Onkelos," in *The Targums*, trans. J. W. Etheridge (New York: KTAV Publishing House, 1968), 54. ఇటువంటి ఆలోచనలే Book of JubileesమరియుBabylonian Talmudలలో కూడా ఉన్నాయి. "Shekinah" అనే పదము యెహోవా యొక్క మహిమను సూచిస్తుంది. [23]Philip S. Alexander, "Targum, Targumim," in *The Anchor Bible Dictionary*, 6:321. [24]Clayton G. Libolt, "Canaan," in *The International Standard Bible Encyclopedia*, rev. ed., ed. Geoffrey W. Bromiley (Grand Rapids, Mich.: Wm. B. Eerdmans Publishing Co., 1979), 1:590. [25]*The Epic of Gilgamesh* 11.193–94. [26]6:4లో, NASB అనే అనువాదము వారు "ప్రసిద్ధి గాంచిన మనుషులు" (అక్షరాలా "పేరు గాంచిన మనుషులు") అని చెప్తుంది. ఇంకొక మాటలో చెప్పాలంటే, సమాజములోని కొన్ని విభాగాలలో వారు తమ కొరకు గొప్ప పేరును సంపాదించుకొని, తమ చెడుతనమును అనుసరించిన వారికి వారు గొప్ప తారలుగా అయ్యారు. [27]"Sword" అనే పదమునకు పోలు ప్రయోగించిన గ్రీకు పదము μάχαιρα (*machaira*), మరియు ఇది హంతకుని ఖడ్గమును (అపొ. 12:2లో వలే) సూచిస్తుంది, ఇది "దుర్మార్గులను శిక్షించుటకు అధికారులకు ఉన్న శక్తి"కి ఒక సూచకముగా ఉంది. (Walter Bauer, *A Greek–English Lexicon of the New Testament and Other Early Christian Literature*, 3d ed., rev. and ed. Frederick William Danker [Chicago: University of Chicago Press, 2000], 622.) [28]ప్రకటన 13:1–10లోని "మృగము" రోమా ప్రభుత్వమును సూచిస్తుంది, మరియు ప్రకటన 13:11–

18లో ఉన్న అబద్ధ ప్రవక్త యొక్క చిత్రణము చక్రవర్తి ఆరాధనను జరిగించే ఒక తెగకు సూచకముగా ఉంది. [29]Francis Brown, S. R. Driver, and Charles A. Briggs, *A Hebrew and English Lexicon of the Old Testament* (Oxford: Clarendon Press, 1962), 761–63. [30]తమ సహోదరులకు భంగము కలిగించే ప్రతిదాని నుండి మరియు అన్నిటినుండి క్రైస్తవులు దూరంగా ఉండాలని పౌలు అనుకోవడం లేదు. ఏదైనా ఒకటి వారి విశ్వాసమునకు మరియు వారి ఆత్మీయ జీవితమునకు "అడ్డుబండ"గా (రోమా. 14:13, 21) ఉండగలిగేదాని గురించి ఆయన మాట్లాడుతున్నాడు.ఈ అధ్యాయము మొదటిలో ఆయన చెప్పినట్లుగా, "ఎవనికొరకు క్రీస్తు చనిపోయెనో వానిని నీ భోజనముచేత పాడు చేయకుము" (రోమా. 14:15).

[31]పౌలు ఒకవేళ ఇరవై ఒకటవ శతాబ్దంలో జీవించినట్లయితే, పైన తెలుపబడిన వాక్యములకు ఇటువంటిది ఒకటి కలిపేవాడు: "మీరు కారు నడిపేటప్పుడు మీ విజ్ఞతను కోల్పోయేటట్లు చేసేది ఏమియు తీసుకొనకండి." ప్రతి సంవత్సరము వేల సంఖ్యలో రోడ్డు ప్రమాదాలు మద్యము సేవించి నడుపుట వలన కలిగేవే.ఈ విషయం క్రైస్తవులను ఒక నిమిషం నిలిచి మద్యమును పానము చేయుటవలన కలుగు సాధ్యమగు పర్యావసానాలను తీక్షణంగా ఆలోచించేటట్లు చేయాలి.